www.vishalabharati.com
epaper:vishalabharati.com


బుధవారం, హైదరాబాద్
20.03.2024
సంపుటి:2 సంచిక:157

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# 14 సీట్లే టార్గెట్!

## ఇప్పటికే 4 స్థానాలకు అభ్యర్థులు ఫైనల్

- మరో 9 సీట్లకు క్యాండిడేట్లు ఎంపిక పూర్తి..
- నేడో రేపో ప్రకటించనున్న కాంగ్రెస్ హైకమాండ్
- 14 స్థానాల్లో విజయం పక్కా అంటున్న నేతలు
- పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి మాస్టర్‌ప్లాన్
- 'హస్తం' గూటికి నేతల క్యూతో ఫుల్‌జోష్



*లోక్ సభ ఎన్నికలకు అధికార కాంగ్రెస్ రెడీ అయ్యింది. 14 సీట్లు గెలవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న 'హస్తం' పార్టీ గెలవడానికి కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. పక్కా స్ట్రాటజీతో అసెంబ్లీ ఎన్నికల టార్గెట్ రీచ్ అయిన తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే వ్యూహం అమలు చేయాలని భావిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ మొదలు పెట్టిందనే చెప్పాలి. ఫిబ్రవరి 2న జరిగిన ఇంద్రవెల్లి బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం మోగించారు. ఇక ఆ తర్వాత జరిగిన కోస్గీ సభలో పార్లమెంట్ ఎన్నికల టార్గెట్‌ను రేవంత్ రెడ్డి ప్రకటించారు.*

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

లోక్‌సభ ఎన్నికల విషయంలో అన్ని పార్టీల కంటే స్పీడ్‌గా హస్తం పార్టీ ఉంది. ఆశావహుల నుంచి అప్లికేషన్లు స్వీకరించిన కాంగ్రెస్ వాటిని వడబోసే పనిలో నిమగ్నమైంది. అభ్యర్థుల ఎంపిక బాధ్యత పూర్తిగా రేవంత్ పై పెట్టిన హైకమాండ్‌గెలుపు గుర్రాలను సెలెక్ట్ చేయమని ఆదేశించింది. ఇప్పటికే మహబూబ్ నగర్, జహీరాబాద్, మహబూబాబాద్, నల్గొండ పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించిన రేవంత్ మరో13 మందిని కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ ప్రకటించడానికి కసరత్తు చేస్తోంది. సీట్ల ఎంపికలో గెలుపు గుర్రాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకోవాలని రేవంత్ భావిస్తున్నారు. దానిలో భాగంగా బీసీలకు నాలుగు టికెట్లు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి పోటీ కోసం భారీ డిమాండ్ ఏర్పడింది. టికెట్ల కోసం హైకమాండ్‌చుట్టూ ఆశావహుల చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. పక్క పార్టీల నేతలు కూడా హస్తం పార్టీ నుంచి పోటీ చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. పలు పార్టీల కీలక నేతలు ఏఐసీసీ నేతలతో చర్చలు జరుపుతూ తాము ఆశించిన టికెట్ ఇస్తే కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి సిద్ధమని చెబుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇండియా కూటమిలో భాగంగా ఉన్న తమకు ఒక్కో సీటు ఇవ్వాలని సీపీఐ, సీపీఎం అడుగుతున్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే.. కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ కొనసాగుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి కీలక నేతలు వరుసగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి ప్రస్తుత వికారాబాద్ జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కార్పొరేటర్ బాబా ఫసియోద్దిన్, బొంతు శ్రీదేవి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, దానం నాగేందర్, రంజిత్ రెడ్డి,తదితరులు కాంగ్రెస్ గూటికి చేరారు. పలు పార్టీల చాలా మంది కీలక నేతలు ఏఐసీసీ నేతలతో టచ్ లో ఉన్నారని పార్లమెంట్

..మిగతా 2 లో

## తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్ గా

# సీపీ రాధాకృష్ణన్

- జార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు..
- పుదుచ్చేరి లెఫ్టినెంట్‌గవర్నర్‌గా కూడా..
- రాష్ట్రపతి, ప్రధానికి రాధాకృష్ణన్ కృతజ్ఞతలు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ గవర్నర్ పదవికి తమిళిసై సోమవారం రాజీనామా చేయగా.. ఆమె రాజీనామాను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ క్రమంలో జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. తెలంగాణతో పాటుగా పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ సీపీ రాధాకృష్ణన్‌కు అడిషనల్‌చార్జి ఇచ్చారు. సీపీ రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన వారు. కోయంబత్తూరు నుంచి రెండు సార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 2023 ఫిబ్రవరిలో జార్ఖండ్

..మిగతా 2 లో

# రేవంత్ .. మల్కాజ్‌గిరిలో లోకల్ అభ్యర్థిని నిలబెట్టే దమ్ముందా?

- 200 కోట్లు ఖర్చుపెట్టే అభ్యర్థి కోసం చూస్తున్నావు కదా..
- నన్ను ఓడించాలంటే డబ్బు సరిపోదు
- సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ ఫైర్

**విశాలభారతి,హైదరాబాద్:**



'నాకు మల్కాజ్‌గిరితో ఏం సంబంధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు... అలాంటప్పుడు ఆయన కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ ప్రాంతం వాడినే నిలబెట్టాలి... లేదంటే ఆయన సంగతి చెబుతా'నని బీజేపీ లోక్ సభ అభ్యర్థి ఈటల రాజేందర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే మల్కాజ్‌గిరి ప్రాంతం వాడినే తనపై పోటీకి నిలపాలని సవాల్ చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... 'మల్కాజ్‌గిరితో నాకు ఏం సంబంధం? అని ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రికి నేను ఓ సవాల్ విసురుతున్నాను... నిజంగా నీకు దమ్ముంటే ఈ ప్రాంతం వ్యక్తినే నాపై పోటీకి నిలుపు' అన్నారు. బయటి వ్యక్తిని నిలబెడితే ఊరుకునేది లేదన్నారు. రేవంత్ రెడ్డి అభ్యర్థి కోసం వెతుకుతున్నాడని... రూ.200 కోట్లు ఖర్చు పెట్టే అభ్యర్థి వారికి కావాలట అని ఎద్దేవా చేశారు. ఈటల రాజేందర్‌ను తట్టుకోవాలంటే రూ.400 కోట్లు ఖర్చు పెట్టే వ్యక్తి కావాలని పేర్కొన్నారు.



## గడ్చిరోలి జిల్లాలో

# భారీ ఎన్‌కౌంటర్

## నలుగురు మావోయిస్టులు మృతి

**విశాల భారతి, నేషనల్‌బ్యూరో:**

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మంగళవారం ఉదయం భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో కనీసం నలుగురు అనుమానిత మావోయిస్టులు, వారిలో ఇద్దరు నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) సభ్యులు మరణించారని పోలీసులు తెలిపారు. గడ్చిరోలి జిల్లాకు 400 కిలోమీటర్ల దూరంలో తెలంగాణ సరిహద్దులో ఉన్న కొలమార్క పర్వతాలలో దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఎన్‌కౌంటర్ జరిగింది. మృతి చెందిన మావోయిస్టులపై రూ. 36 లక్షల సామూహిక రివార్డు ఉందని గడ్చిరోలి, నీలోత్పాల్ ఎస్పీ తెలిపారు. గడ్చిరోలిలో అనుమానిత మావోయిస్టులు ఉన్నట్లు సోమవారం మధ్యాహ్నం తమకు సమాచారం అందిందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో విధ్వంసక కార్యకలాపాలకు పాల్పడే లక్ష్యంతో వారు పొరుగున ఉన్న తెలంగాణ నుంచి ప్రాణహిత నదిని దాటి ప్రవేశించారు. "సమాచారాన్ని ధృవీకరించిన తర్వాత, మేము వెంటనే పోరాట కార్యకలాపాలలో నైపుణ్యం కలిగిన బహుళ పోలీసు బృందాలను మరియు సెంట్రల్ రిజర్వ్

..మిగతా 2 లో

# ఉచ్చు బిగుస్తోంది!

## మలుపులు తిరుగుతున్న ఫోన్ ట్యాపింగ్

- గులాబీ పార్టీ లీడర్లలో మొదలైన గుబులు
- మాజీ మంత్రి హస్తం ఉందని ప్రచారం
- ప్రణీత్ రావ్ తెల్వదంటున్న 'ఎర్రబెల్లి'
- వరంగల్ లో ఇద్దరు సీఐలు అరెస్ట్
- ఇంకా ఎవరిని అరెస్టు చేస్తారో...?
- విచారణలో కీలక విషయాలు వెల్లడి



**తెలంగాణలో సంచలనంగా మారిన ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన ట్యాపింగ్ కేసులో.. రోజుకో ట్విస్ట్ వెలుగులోకి వస్తుంది. అయితే.. ప్రణీత్ రావును కస్టడీలోకి తీసుకున్న అధికారులు రహస్యంగా విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో మరో ఇద్దరు అధికారులను కూడా అరెస్ట్ చేయటం ఇప్పుడు సంచలనంగా మారింది. మరోవైపు.. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో లింకులు దేశాలు దాటినట్లు ఆధారాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. కస్టడీలో ఉన్న ప్రణీత్‌రావు కీలక విషయాలు వెల్లడించినట్టు తెలుస్తోంది. హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద కట్టుదిట్టమైన భద్రత మధ్య.. గేట్లు మూసివేసి మరీ విచారణ చేశారు అధికారులు. అయితే.. హార్డ్ డిస్కులను కట్టర్లతో కత్తిరించి వికారాబాద్ అడవిలో పడేసినట్లు ప్రణీత్ రావు ఒప్పుకున్నాడని సమాచారం.**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఇదిలా ఉంటే.. ఈ కేసులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మరో ఇద్దరు పోలీస్ అధికారులను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అధికారులు అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాత్ర కూడా ఉందనే ప్రచారం జరుగుతుండగా.. ఆయన నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసు అధికారులను అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు సంచలనంగా మారింది.

మరోవైపు.. ఈ కేసు నెట్‌వర్క్ ఇప్పుడు కేవలం తెలంగాణ వరకే పరిమితం కాకుండా.. దేశాలు దాటినట్టు బయటపడుతోంది. సర్వీస్ ప్రొవైడర్ల సహకారం లేకుండానే ప్రణీత్ రావు ప్రైవేట్ వ్యక్తుల కాల్స్ విన్నట్టు బయటపడుతోంది. సాధారణంగా అయితే.. ఎస్ఐబీలో నోడల్ ఆఫీసర్ ప్రమేయంతోనే కాల్ రికార్డింగ్స్ వినే సదుపాయం ఉంటుంది. అందుకోసం ఒక లింక్‌ను నోడల్ అధికారి ఎస్ఐబీ వారికి ఇస్తాడు. కానీ.. ప్రణీత్ రావు మాత్రం అనధికారికంగా కొన్ని సాఫ్ట్‌వేర్లను ఇతర దేశాల నుంచి కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఎస్ఐబీలో ఉన్న కొన్ని కంప్యూటర్లలో ఈ మాల్వేర్‌ను ఇన్‌స్టాల్ చేసిన ప్రణీత్ అండ్ టీమ్.. సర్వీస్ ప్రొవైడర్ల సహకారం లేకుండానే కాల్స్ విన్నట్టు తెలుస్తోంది. అయితే.. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజునే కొత్త మాల్వేర్‌లను కంప్యూటర్ల నుంచి తొలగించినట్టు అనుమానిస్తున్నారు. మాల్వేర్ నుంచి విన్న కాల్ రికార్డింగ్స్‌ను హార్డ్ డిస్కు, పెన్ డ్రైవ్‌లోకి ట్రాన్స్ ఫర్

..మిగతా 2 లో



# అకాల వర్షాలు

## రాష్ట్రంలో 2 రోజుల పాటు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం మాత్రం ఉరుములు,

..మిగతా 2 లో



# వడగళ్ల బాధితులకు అండగా నిలవాలి

- నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- ఎకరానికి రూ. 10 వేలు నష్టపరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- ఎమ్మెల్యే హరీష్‌రావు ఆదేశం
- ఢిల్లీ నుంచి టెలీ కాన్ఫరెన్స్

..మిగతా 2 లో

# నేడు నల్లా నీళ్లు బంద్..

- సింగపూర్ టు ఖానాపూర్ మధ్య పైప్ లైన్‌కు రిపేర్లు
- ఓఅండ్ఎం డివిజన్ 3, 18 ప్రాంతాల్లో అంతరాయం

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

నగరంలో తాగునీటి కష్టాలు క్రమంగా మొదలవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ లో ఈ మధ్య ఏదో ఒక మూల ఏదో ఒక పైప్ లైన్ మరమ్మతు పనుల పేరుతో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆ ప్రాంత వాసులను జలమండలి అలర్ట్ చేస్తూ ముందుగానే నీటిని పొదుపు చేసుకోవాలని సూచిస్తోంది. ఇప్పుడు మళ్లీ మరొక చోట మరమ్మతుల పని పేరిట వాటర్ కట్ కానుంది.

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు ప్రాజెక్టులో సింగపూర్ నుంచి ఖానాపూర్ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ పైపు లైన్ లోని 350 ఎంఎం డయా స్లూయిస్ వాల్వ్‌కు

..మిగతా 2 లో






# పార్టీ మారడం లేదు

- తప్పుడు ప్రచారం చేయకండి
- ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్ క్లారిటీ
- వీళ్లిద్దరూ పార్టీ మారుతున్నారంటూ జోరుగా ప్రచారం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

భారత రాష్ట్ర సమితి నేతలకు పెద్ద కష్టం వచ్చింది. వారిపై రోజూ .. పార్టీ మారుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో సీనియర్ నేతలు మీడియా ముందుకు వచ్చి తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పార్టీ మారే ఉద్దేశం లేదని అంటున్నారు. అయితే రోజుకో సీనియర్ నేత పార్టీకి గుడ్ బై చెబుతూండటంతో వారి మాటలను అనుమానాస్పదంగానే చూస్తున్నారు. తాజా మాజీ

..మిగతా 2 లో



## గడ్చిరోలి జిల్లాలో

# భారీ ఎన్‌కౌంటర్

**మొదటిపేజీ తరువాయి**

పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) త్వరిత చర్య బృందాన్ని ఏర్పాటు చేసాము. వారిని ఆ ప్రాంతంలో అన్వేషణ కోసం పంపారు" అని నీలోత్పాల్ తెలియజేశాడు. కాల్పులు ఆగి, ఆ ప్రాంతాన్ని శోధించిన తర్వాత, నాలుగు మగ మృతదేహాలు, ఆయుధాలు మరియు మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు, వాటిలో ఒక ఏకే 47, ఒక కార్బైన్, రెండు దేశీయ తుపాకీలు సీపీఐ (మావోయిస్ట్) సాహిత్యం ఉన్నాయి. ఎన్‌కౌంటర్ తర్వాత గాయపడిన కొందరు అనుమానిత మావోయిస్టులు ప్రాంతం నుండి తప్పించుకోగలిగారని జిల్లా పోలీసులు అనుమానిస్తున్నారు. "చనిపోయిన మరియు అనుమానిత మావోయిస్టులు వర్గీష్, మాగ్తు, సిపిఐ (మావోయిస్ట్) యొక్క వివిధ డివిజన్ కమిటీల కార్యదర్శులు మరియు ప్లాటూన్ సభ్యులు కుర్సంగ్ రాజు మరియు కుడిమెట్ట వెంకటేష్‌గా గుర్తించారు" అని నీలోత్పాల్ చెప్పారు.

# 14 సీట్లే టార్గెట్!

**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికలలోపే వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతారని సమాచారం. ఇక ఈ చేరికలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడతాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీప్ దాస్ మున్షీ , సీఎంగా రేవంత్ రెడ్డి ఎదుర్కోనున్న తొలి ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలను ఆ ఇద్దరు నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక 14 స్థానాలు పక్కా అంటున్న కాంగ్రెస్ నేతల ప్లాన్ వర్కవుట్ అవుతుందో లేదో చూడాలి.

# ...ఇన్‌చార్జి గవర్నర్ గా సీపీ రాధాకృష్ణన్

**మొదటిపేజీ తరువాయి**

గవర్నర్ గా ఎన్నికయ్యారు. కాగా, లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నందున తమిళిసై రాజీనామా చేశారు. తమిళనాడు లోని కన్యాకుమారి లేదా తిరునల్వేలి లేదా చెన్నై సౌత్ లేదా పుదుచ్చేరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యింది. బీజేపీ కూడా మెజారిటీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. త్వరలో పెండింగ్ లో ఉన్న సీట్లకు క్యాండిడేట్లను ప్రకటించాల్సి ఉన్నందున , రాజీనామాకు బీజేపీ హై కమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతోనే తమిళిసై పదవి నుంచి వైదొలిగినట్టు సమాచారం.ఈ క్రమంలో తాజాగా తెలంగాణ , పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ లుగా బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. "మాతృభూమికి సేవ చేయడానికి ఈ గొప్ప అదనపు బాధ్యతను నాకు ఇచ్చినందుకు అత్యంత గౌరవనీయమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీజీ, హోంమంత్రి అమిత్‌షాజీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# ఉచ్చు బిగుస్తోంది!

**మొదటిపేజీ తరువాయి**

చేసుకున్న ప్రణీత్ రావు..వాటిని ధ్వంసం చేసినట్టుగా విచారణలో తెలిసినట్టు సమాచారం.

మరోవైపు ప్రణీత్ రావు వెనకాల మీడియా సంస్థ యజమాని ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మీడియా సంస్థ యజమాని ఇచ్చిన నెంబర్లను ప్రణీత్ రావు ట్యాప్ చేసినట్లు గుర్తించారు పోలీసులు. ఆ మీడియా సంస్థ యజమాని దగ్గర ఒక సర్వర్ పెట్టినట్లు అనుమానిస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేత ఆదేశాలతో వరంగల్, సిరిసిల్లలో సర్వర్లు ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ అంశంపై లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు పోలీసులు. దీంతో ఎవరెవరిని అరెస్టు చేస్తారనేది హాట్ టాపిక్ గా మారింది.

# వడగళ్ల బాధితులకు అండగా నిలవాలి

**విశాలభారతి,హైదరాబాద్:**

రాష్ట్రంలోని పలు జిల్లాలో కురిసిన వడగళ్ల వర్షం వల్ల నష్టపోయిన బాధితులకు అండగా నిలవాలని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్ రావు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను ఆదేశించారు. వడగళ్ల బీభత్సంపై ఢిల్లీ నుంచి మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. బాధితుల వద్దకు వెళ్లి వారిని పరామర్శించి వారిలో ధైర్యం నింపాలని ఇందు కోసం యుద్ధప్రాతిపదికన ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. పార్టీ నుంచి సహాయం అందించి ప్రజలకు అండగా నిలవాలన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటకు ఎకరానికి రూ. 10 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి తక్షణ సహాయం అందించాలని కోరారు. భారీ వర్షానికి కూలిన పాత ఇళ్లను పరిశీలించాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్ రావు రెవెన్యూ, వ్యవసాయ,ఉద్యాన వన శాఖ, విద్యుత్, మున్సిపల్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సిద్దిపేట పట్టణంలో చెట్లు, పలు రోడ్లు, అక్కడక్కడ విద్యుత్ స్థంభాలు వైర్లు కింద పడ్డాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటించి బాధితుల వద్దకు వెళ్లి వారిని పలకరించి ఆదుకోవాలని సూచించారు.

# అకాల వర్షాలు

**మొదటిపేజీ తరువాయి**

మెరుపులతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశాలున్నాయని ప్రకటించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. కింది స్థాయి గాలులు దక్షిణ ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రం వైపునకు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం, ఈరోజు అదే ప్రాంతంలో కొనసాగుతుందని వాతావరణ కేంద్రం సంచాలకులు వివరించారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే రెండు, మూడు రోజుల్లో అకాల వర్షాలు సంభవించే అవకాశం ఉన్నందున రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాల కారణంగా పలు జిల్లాల్లో పంట నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, తగు సూచనలు చేయాలని ఆదేశించారు. మార్కెట్కు తీసుకువచ్చిన ధాన్యం, మిర్చి, తదితర పంటలు దెబ్బ తినకుండా అధికారులు జాగ్రత్తలు చేపట్టాలన్న మంత్రి, కల్లాల్లో ఆరబోసిన పంటలు దెబ్బ తినకుండా రైతులకు తగు సూచనలు చేయాలని ఆదేశించారు.

గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తోన్న అకాల వర్షాలు, ఈదురుగాలులు అన్నదాతలతో పాటు సాధారణ ప్రజానీకాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు ఓ చిన్నారిని బలి తీసుకున్నాయి. కౌడిపల్లి మండలం రాజ్‌పేట్ జాజి తండాలో గాలి వాన బీభత్సానికి చిన్నారి మృతి చెందింది. ఇంట్లో రేకులకు కట్టిన చీర ఊయలలో ఆడుకుంటున్న సంగీత, గాలి తాకిడికి రేకులతో పాటు ఎగిరి పక్కన బిల్డింగ్ పై పడినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో వారంతా కూలీ పనులకు వెళ్లగా, చిన్నారి ఒక్కతే ఇంట్లో ఉండటంతో గాలి వాన బీభత్సానికి బలైంది. చిన్నారి తలకు, కడుపులో బలమైన గాయాలు కావడంతో తండావాసులు గమనించి 108లో హైదరాబాద్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చిన్నారి ఈరోజు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పాప మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.







# కన్నీళ్లు తుడిచే ఆపద్బాంధవుడు 'కోమటిరెడ్డి'

- తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి
- ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి వెంకన్నగౌడ్ మృతి
- బాధిత కుటుంబానికి మంత్రి వెంకట్రెడ్డి లక్ష సాయం

**విశాలభారతి, తిరుమలగిరి:**

ఎక్కడైనా.. ఎవరైనా.. సమస్యల్లో ఉంటే ఆయన గుండె తరుక్కుపోతుంది. క్షణం ఆలోచించరు.. క్షణాల్లోనే సాయం చేస్తారు. కులమతాలకు అతీతం ఆయన దాతృత్వం. కష్టంలో ఉంది ఎవరైనా సరే.. నేనున్నానని అక్కున చేర్చుకుంటారు. అండగా నిలిచి ఆర్థిక సాయం అందిస్తారు. ఆ కుటుంబంలో తానూ ఒక్కడిననే భరోసా కల్పిస్తారు. ఆయన కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ,అలియాస్ తెలంగాణ వెంకన్న తాజాగా సూర్యాపేట జిల్లాలోని ఓ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే మార్చి 17 ఆదివారం పాలకుర్తి వెంకన్న గౌడ్ గుండెపురి గ్రామంలో తాడిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందారు. ఆతనికి భార్య ఒక కుమార్తె ఉన్నారు. ఆర్థికంగా ఎలాంటి భూమి కూడా లేదు. కులవృత్తి బతుకుదెరువుగా జీవనం సాగిస్తున్నాడు. వీరికి రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం తన సొంతంగా లక్ష రూపాయలు ఆర్థిక సాయం.. తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో ఉన్నప్పుడు అండ.. కన్నీళ్లు తుడిచే ఆపద్బాంధవుడు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అని కొనియాడారు. ఆయన మాస్ లీడర్ అనే పదానికి బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య , తిరుమలగిరి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరవతు జుమ్మిలాల్ నాయక్ లు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పేరాల వీరేశ్, గుండెపురి గ్రామ బొడ్డు బాలకృష్ణ, తిరుమలగిరి మండల యూత్ అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు బలిక రమేష్, తిరుమలగిరి మండల సేవా దల్ అధ్యక్షుడు కోనేటి మహేశ్, కొమ్ము సోమన్న, పరశురాం, పి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# మార్చి 23న ఎర్త్ అవర్ పాటించండి

- సాయంత్రం లైట్లు ఆఫ్ చేయండి

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

'ఎర్త్ అవర్' లో భాగంగా దేశ వ్యాప్తంగా మార్చి 23న సాయంత్రం 8.30 నుంచి 9.30 ఒక గంట పాటు లైట్లు ఆఫ్ చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో "ఎర్త్ అవర్" పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఎర్త్ అవర్' అనేది గ్రహం ఎదుర్కొంటున్న ట్రిపుల్ సంక్షోభాన్ని గుర్తించడానికి, వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం, పర్యావరణం రక్షించడానికి సహకరిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, స్విచ్చాఫ్ పవర్ ద్వారా ఎర్త్ అవర్ పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం వ్యక్తులు, సంస్థలు, వివిధ సంఘాలు అనవసరమైన లైట్లను ఒక గంట పాటు ఆఫ్ చేయాలని కోరారు. మార్చి 23న రాత్రి 8-30 నుంచి 9-30 గంటల సమయంలో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్, దుర్గం చెరువు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం, బుద్ధ విగ్రహం, గోల్కొండ కోట, చార్మినార్, స్టేట్ లైబ్రరీ, ఇతర స్మారక చిహ్నాలన్నింటిలో లైట్లు ఆర్పాలని ఆమె కోరారు.





# పార్టీ మారడం లేదు

**మొదటిపేజీ తరువాయి**

మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**అయోధ్యకు వెళ్లాను.. బీజేపీలో చేరడానికి కాదు శ్రీనివాస్ గౌడ్**

తాను బీజేపీలోకి చేరుతున్నట్లు వస్తున్న వార్తలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. తాను బీజేపీలో చేరుతున్నాననడం అవాస్తవమని స్పష్టం చేశారు. అయోధ్య గుడికి వెళ్తే బీజేపీలో చేరినట్టా అని ప్రశ్నించారు. తానేంటో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తెలుసని అన్నారు. కొందరు కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రలోభాలు పెట్టినప్పటికీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లొంగలేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బహుజనుల కోసం పోరాడుతుందనే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారని పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీలోకి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీలా దేశంలో బహుజనుల కోసం పోరాడిన పార్టీ ఉన్నదా అని ఆయన ప్రశ్నించారు.

**బీఆర్ఎస్‌ను వీడను: ఎర్రబెల్లి**

బీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు..పార్టీని కాపాడుకునేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడారు. ఇతర పార్టీల్లోకి వెళ్లే ముచ్చటనే లేదని స్పష్టంగా చెబుతున్నాను. బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కష్టపడి పని చేస్తాను. ప్రతిపక్షంలో కూడా పని చేసిన సందర్భాలు ఉన్నాయి. చాలా మంది సీఎంలను కూడా ఎదుర్కొన్నాను. పార్టీలోకి రాకపోతే వర్ధన్నపేటను ఎస్సీ రిజర్వ్డ్ చేస్తాను.. ఎక్కడ పోటీ చేయనివ్వకుండా చేస్తానని రాజశేఖర్ రెడ్డి బెదిరించారు. ఎంపీగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి లాగేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా పార్టీలో చేర్చుకోవాలని ప్రయత్నం చేశారు. కానీ తనను పాలకుర్తి ప్రజలు ఆశీర్వదించి గెలిపించారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదన్నారు.

**ప్రాంతీయ పార్టీలను అంతం చేస్తారా?**

ప్రధాని దేశ నాయకుడిగా కాకుండా గల్లీ నేతగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడం మోదీకి అలవాటు అని విమర్శించారు. వందల ప్రాణాలను బలి తీసుకున్న మోదీకి కవితను జైలుకు పంపించడం చిన్న విషయమని అన్నారు. వ్యతిరేకించిన వారిని ఇబ్బంది పెట్టడమే మోదీ నైజమని ఆరోపించారు. బీజేపీలో చేరిన వారు పవిత్రులైపోతున్నారని అన్నారు. ప్రాంతీయ పార్టీలను కబళించే కుట్ర జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ వచ్చే ముందు ఈడీ, సీబీఐ వస్తాయని విమర్శించారు. మోదీ పాలన దేశం భ్రష్టు పట్టిందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# నేడు నల్లా నీళ్లు బంద్..

**మొదటిపేజీ తరువాయి**

డ్యామేజీ జరిగింది. ఈ వాల్వ్‌కు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు బుధవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు చేపడతామని హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు అధికారులు తెలిపారు. దీంతో ఈ పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా అయ్యే ప్రాంతాలకు 10 గంటలు నీరు నిలిచిపోనున్నాయి. ఆయా ప్రాంతవాసులు అలర్ట్ కావాలని అధికారులు సూచిస్తున్నారు.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు**

1. ఓ అండ్ ఎం డివిజన్ 3 : షేక్ పేట్, టోలిచౌకి, గోల్కొండ, భోజగుట్ట రిజర్వాయర్ ప్రాంత పరిధిలో లో ప్రెజర్ సమస్య
2. ఓ అండ్ ఎం డివిజన్ 18 : గండిపేట్, కోకాపేట్, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, ఖానాపూర్, నెక్నంపూర్, మంచిరేవుల.కావున అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని జలమండలి కోరింది.

# కవిత బాధితురాలు మాత్రమే

- నిందితురాలు కాదు
- కేసీఆర్, కేజ్రీవాల్లను దెబ్బ తీసేందుకు కుట్ర
- కడిగిన ముత్యంలా కేసు నుంచి కవిత బయటపడతారు
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఎమ్మెల్సీ కవిత అరెస్టు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడినదేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. కేసీఆర్, కేజ్రీవాల్లను రాజకీయంగా దెబ్బ తీసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని అన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే సాక్షిగా ఉన్న కవిత పేరును నిందితురాలిగా చేర్చారన్న ఆమె, కేసులో కవిత బాధితురాలు మాత్రమేనని, నిందితురాలు కాదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు తెలంగాణ భవన్లో ఆమె మాట్లాడారు. లోక్సభ ఎన్నికల్లో లబ్ధి కోసమే భారతీయ జనతా పార్టీ కవితను ఈడీ ద్వారా అరెస్ట్ చేయించిందన్నారు. ఈ క్రమంలోనే అప్రూవర్లుగా మారి ఏది చెప్పినా చెల్లుతుందా అన్న సత్యవతి రాథోడ్, మోదీకి డబ్బులు ఇచ్చామని ఎవరైనా చెబితే ఆయనను కూడా అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్ను దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కవిత పోరాట యోధురాలని, కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటపడతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్, కేజ్రీవాల్లను రాజకీయంగా దెబ్బ తీసేందుకు బీజేపీ కుట్ర పన్నింది. అందులో భాగంగానే సాక్షిగా ఉన్న కవిత పేరును నిందితురాలిగా చేర్చారు. ఈ కేసులో కవిత బాధితురాలు మాత్రమే. నిందితురాలు కాదు. కవిత పోరాట యోధురాలు. కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటపడతారు. మరోవైపు ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా, ప్రధాని మోదీ తమ పార్టీపై ఎలా నిందలు వేస్తారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ప్రశ్నించారు. కేసీఆర్ను లొంగదీసుకునేందుకు ఆడబిడ్డ అని కూడా చూడకుండా కవితను మోదీ అరెస్టు చేయించారని ఆరోపించారు. ఈ క్రమంలోనే భారతీయ జనతా పార్టీలో నేరస్థులు చేరితే పరమ పవిత్రులు అవుతారా అని నిలదీశారు. కవిత రిమాండ్ రిపోర్టులో తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె అని రాజకీయ దురుద్దేశంతో ప్రస్తావించారని ఆక్షేపించిన సునీత, బీజేపీ దురుద్దేశం లోకానికి తెలియడానికి ఈ ఒక్క అంశం చాలని వ్యాఖ్యానించారు. ఇది ఈడీ కేసు కాదని, మోదీ కేసు అని అన్నారు. మోదీకి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

# రేవంత్ కి పథకాల అమలుపై శ్రద్ధ లేదు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



రేవంత్ ప్రభుత్వానికి విచారణల మీద ఉన్న శ్రద్ధ పథకాల అమలు చేయడంలో లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. విచారణల పేరిట కేసీఆర్ హయాంలో అమలైన గొప్ప పథకాలను పక్కన బెట్టే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం కొప్పుల ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి విగ్రవీగే మాటలు మాట్లాడటం సరికాదని అన్నారు. ఆయన అధికార పక్షంలో ఉన్నారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.సీఎం రేవంత్ వాడుతున్న భాషకు ఆయనపై క్రిమినల్ కేసు పెట్టాలని కొప్పుల ఈశ్వర్ అన్నారు. యాసంగి పంటకు నీళ్లివ్వడం ఈ ముఖ్యమంత్రికి చేతనవ్వడం లేదని, ఆసరా పెన్షన్లు నాలుగు వేలు ఇస్తామని చెప్పి, అమలు చేయడంలేదని విమర్శించారు. రైతు బంధుకు దిక్కే లేదని, దళిత బంధును కావాలనే ఆపేశారని ఆరోపించారు. దమ్ము ధైర్యం ఉంటే రేవంత్ కేసీఆర్ కన్నా మంచి పాలన చేసి చూపాలని సవాలు విసిరారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో అమలైన సంక్షేమ పథకాలు మరెక్కడా అమలు కావడం లేదని అన్నారు

# ఘనంగా సుప్రసేనారెడ్డి బర్త్‌డే వేడుకలు

- స్థానికుల శుభాకాంక్షల వెల్లువ

**విశాల భారతి, సిటీబ్యూరో:**



పెద్ద అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ కందాడ అనుపమ సుప్రసేనారెడ్డి బర్త్‌డే ను మంగళవారం కుంట్లూరులో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, సహచర కౌన్సిలర్లు, వార్డు పరిధిలోని అభిమానులు, యువకులు భారీ సంఖ్యలో హాజరై కేకులు కట్ చేయించి షాలువాలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పటాకులు కాల్చి సంబరాలు చేశారు. వార్డు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ.. పిలిస్తే.. పలికే సుప్రసేనారెడ్డి భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుప్రసేనారెడ్డి మాట్లాడుతూ.. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అనిల్, శేఖర్, మధు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లోసారి తెలంగాణకు ఎన్డీఎస్ఏ కమిటీ

- నేటి నుంచి 3 రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటన

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలనకు ఏర్పాటు చేసిన నేషనల్‌డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)కమిటీ రెండోసారి రాష్ట్రానికి రానుంది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఈ కమిటీ బుధవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటించనుంది. నీటి పారుదలశాఖ ఇంజనీర్లతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం కానుంది. మూడు బ్యారేజీలకు సంబంధించిన ప్రణాళిక, డీపీఆర్ తయారీ, హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, ఎస్డీఎస్ఓ, ఎస్సీడీఎస్ ఇంజినీర్లతో పాటు నిర్మాణ సంస్థలు, నిపుణులతో సమావేశం జరపనుంది. గత పర్యటనలో కొన్ని విభాగాల ఇంజినీర్లతో సమావేశమైన కమిటీ.. వాటికి కొనసాగింపుగా ఈ దఫా భేటీ నిర్వహించనుంది.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**ఎమ్మెల్యే మందుల సామేలు**

**శాలిగౌరారం, విశాలభారతి:** మండలంలో ఎమ్మెల్యే మందుల సామేలు మంగళవారం పర్యటించారు. రామంజపురం గ్రామానికి చెందిన అబ్బయ్య ఇటీవల మృతి చెందారు. చిత్తలూరు గ్రామానికి చెందిన గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్ది మహేష్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామానికి చెందిన ఎర్ర గణేష్ గుండెపోటుతో మృతి చెందారు. వంగమర్తి గ్రామానికి చెందిన గడ్డిపర్తి నాథనియల్ మృతి చెందాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు గారు బాధిత కుటుంబ సభ్యులను తమ ప్రగాఢ సానుభూతి సంతాపం చేశారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.బాధిత కుటుంబాలను ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ అధ్యక్షులు సమరం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాదురి శంకర్ రెడ్డి,ఎంపీటీసీ నోముల జనార్ధన్, బొమ్మగాని రవి, ఎర్ర చైతన్య ,బండారు మల్లయ్య, పెరమాడ్ల నరేష్,మాదగాని అంజయ్య, వేముల గోపీనాథ్, దేవరకొండ జయరాజ్ , మంగదుడ్ల శ్రీనివాస్ ,బెల్లి వీరభద్రం , కిషోర్ దాసరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం సీపీఎం

**చిట్యాల, విశాలభారతి:**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, సరోజలు విజ్ఞప్తి చేశారు. చిట్యాల మండల కేంద్రంలో మంగళవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి, దొరలు ,భూస్వాముల గడీలపై దాడులు చేసి, ధాన్యాన్ని పేదలకు పంచిన స్వరాజ్యం ధైర్యం, నేటి యువతకు ఆదర్శం అని కొనియాడారు. నిజాం సైన్యం ఆమెను పట్టిస్తే పదివేల రూపాయలు నజరానా ఇస్తామని ప్రకటించినా మొక్క



వోని దీక్షతో పేదల హక్కుల కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పనిచేసి ,వందల ఎకరాల భూములు పంచిన వీరనారి స్వరాజమని, చిన్ననాడే తన సోదరుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి తోపాటు అడుగులు వేసిన కమ్యూనిస్టు యోధురాలని, రెండు పర్యాయాలు తుంగతుర్తి శాసనసభ్యురాలుగా ఎన్నికై, పేదలు ,రైతుల , మహిళల కష్టాలను పాలకుల దృష్టికి తీసుకుపోయి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. వారి త్యాగం ఎన్నటికి మరువలేనిదని, వారి ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకు మనం అందించే ఘనమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శీలా రాజయ్య, ఐతరాజు నరసింహ, కత్తుల లింగస్వామి, కల్లూరి కుమారస్వామి, మేడి సుగుణమ్మ , అక్కెనపల్లి నాగయ్య ,ఐతరాజు యాదయ్య,గుడిసె లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభోత్సవాలకు బ్రేక్

**జిల్లా ఎన్నికల అధికారి,**
**కలెక్టర్ ఎస్ వెంకట్రావ్**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివిధ శాఖల ద్వారా నాన్ స్టార్ట్ ( పనులు ప్రారంభించనవి) పనుల వివరాలను సత్వరమే అందచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఎంసీసీ నోడల్ అధికారి డి ఎఫ్ వో సతీష్ కుమార్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ కు ముందు జరుగుతున్న పనులు అలాగే కోడ్ తదుపరి ఉన్న పనులు, టెండర్ ప్రక్రియలో గల పనుల వివరాలు సత్వరమే అందించాలని సూచించారు. జిల్లాలో మోడల్ కోడ్ కాండక్ట్ అమలులో ఉన్నందున నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టరాదని సూచించారు. కోడ్ కు ముందు జరుగుతున్న పనులు యధావిధిగా కొనసాగింపులు చేసుకోవచ్చని సూచించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్న నివేదికలో చూపాలని, అలాగే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే బాధ్యులను చేస్తామని సూచించారు. నీటి పారుదల, రోడ్డు భవనాల శాఖ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీలు వ్యవసాయ శాఖ, యస్.సి, బి.సి వెల్ఫేర్ తదితర శాఖల పనుల పై సమీక్షించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ఎక్కడ కూడా నీటి ఎద్దడి రాకుండా చూడాలని అలాగే ఈ సమస్యపై రాష్ట్ర స్థాయిలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఈ.ఈ పి.ఆర్. ఎం .వేంకటేశ్వర రావు,ఈ ఈ ఇరిగేషన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- పాఠశాలలు, నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ రామకృష్ణ**

**పినపాక,విశాల భారతి :** వేసవికాలంలో ఎండలు మండిపోతూ ఉండడంతో, నర్సరీలలోని మొక్కలను కాపాడుకోవడానికి గ్రీన్ నెట్ ను ఏర్పాటు చేయాలని కార్యదర్శిలకు ఎంపీడీవో రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని దుగినేపల్లి, చెగర్శల, జానంపేట లలో ఏర్పాటు చేసిన నర్సరీలని ఆయన పరిశీలించారు. నర్సరీలలో ఉదయం సాయంత్రం తప్పకుండా నీటిని అందించాలని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నర్సరీని కాపాడడంతోపాటు గ్రామంలోని తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టిని సాధించాలని ఆయన కార్యదర్శిలను ఆదేశించారు. దుగినేపల్లి, చెగర్శల, జానంపేట లో ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అక్కడ గల వంట షెడ్ లను , పరిసరాలు, తరగతి గది నిర్వహణ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏపీవో వీరభద్రస్వామి, స్థానిక సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




## తిరుమలనాథుని కళ్యాణంలో పాల్గొన్న మాజీ ఎంపీ

**చిట్యాల, విశాలభారతి:** మండలం పెద్దకాపర్తి లో జరుగుతున్న భూ సమేత తిరుమల నాద స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో భువనగిరి మాజీ ఎంపీ, బిజెపి భువనగిరి ఎంపీ అభ్యర్థి డా. బూర నర్సయ్య గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రానున్నది కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కారేనని ప్రజలందరూ మరొకసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పెద్దకాపర్తి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బత్తుల కళావతి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్, మండల కన్వీనర్ పొట్లపల్లి నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు పొట్లపల్లి చంద్రయ్య.పోట్ల పల్లి సుభాష్.వడ్డేపల్లి మురళి, చిలువేరు నరసింహ,మర్రి హరీష్ రెడ్డి, కాటం సందీప్, బూత్ అధ్యక్షులు మర్రి వెంకట్ రెడ్డి, మోర ధనంజయ, తిరుమలేష్ , లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగి ఉండాలి

**కోదాడ, విశాలభారతి:** పట్టణంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో 'ఫుడ్ ఫెస్టివల్ ' కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పొట్టా కిరణ్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి విద్యార్థికి ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలి అని తల్లిదండ్రులకు సూచించాడు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వాటిలో ఉండే పోషక విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, శ్రీమన్నారాయణ కాలన్ని వాసులు పాల్గొని వంటకాలను తిలకించారు.





## విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ

**పినపాక, విశాలభారతి :** సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయితీ మద్దులగుడెం గ్రామ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హోప్ చారిటయిల్ సొసైట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఇంచార్జ్ యోహాను ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని కోరారు. పేద విద్యార్థుల కోసం హోప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంల అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లుగా తెలియజేశారు. ఆదివాసి గ్రామాల్లో సైతం సేవలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యాయులు సుధీర్ , సత్యనారాయణ ,సంస్థ ఇంచార్జి మణికుమార్, యాసిన్, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు .



## పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి.**

**దంతాలపల్లి ,విశాల భారతి:** పేదలకు ఇంటి స్థలాలు, ఇండ్లు, ఉపాధి సాధన కోసం నిజాయితీగా పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. దంతాలపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశంలో నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా పేదలకు ఇంటి స్థలాలు, ఇండ్లు దక్కలేదని, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని నూతన ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిజమైన పేదలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబించే విధానాల వలన నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, నిరుద్యోగిత 24% అయిందని, వికసిత భారత్ పేరుతో దేశంలో పేద, మధ్య తరగతి వారిపై పన్నులు మోపి కార్పొరేట్లకు సంపద దోచిపెడుతున్నారని, ప్రపంచ కుబేరులలో భారత్ కుబేరుల సంఖ్య పెరిగిపోతుందని, దేశంలో పేదరికం అంతకంతకు పెరుగుతుందని, మత విద్వేష రాజకీయాలతో పాలన సాగిస్తూ ప్రజలను మాయ చేస్తున్న మోడీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు తురక రమేష్, సారయ్య,మురళి, సోమారపు వెంకటయ్య,కృష్ణ,జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

**సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్**

**గరిడేపల్లి, విశాలభారతి:** గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్ డిమాండ్ చేశారు.మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పోనుగొడు గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సంవత్సరాల తరబడి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న కార్మికుల సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. అర్హులైన వారిని పంచాయతీ కార్యదర్శులుగా నియమించి,ఉద్యోగ భద్రతనిస్తూ పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలలో మూడు, నాలుగు నెలలు కొన్ని గ్రామ పంచాయతీలో తొమ్మిది నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని,సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని ఈ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పది పరీక్షలు

- **పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసిన అధికారులు**
- **సెంటర్లని తనిఖీ చేసిన డిఇఓ, అసిస్టెంట్ కమిషనర్**

చిట్యాల, విశాలభారతి: జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 109 సెంటర్లలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లోని మొత్తం విద్యార్థులు 19249 కి గాను 19198 మంది విద్యార్థులు హాజరయ్యారని.51 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ముగ్గురు సప్లమెంటరీ విద్యార్థుల్లో ఒకరు హాజరయ్యారని, డీఈఓ బొల్లారం బిక్షపతి 12, అసిస్టెంట్ కమిషనర్ 5 సెంటర్లను అలాగే 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 36 పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేసారని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్



యూసఫ్ షరీఫ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంద ని పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. చిట్యాల మండల కేంద్రంలో మొత్తం 473 మంది విద్యార్థులకి 472 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని, ఫ్లయింగ్ స్పాట్స్ చిట్యాల లోని సెంటర్లను తనిఖీ చేశారని ఎంఈఓ కూకుట్ల నరసింహ తెలిపారు.

# నకిలీ మహిళా ఎస్సై అరెస్ట్

**నల్లగొండ, విశాలభారతి:** రైల్వే పోలీస్ అధికారిని అని చెప్పుకుంటున్న తిరుగుతున్న నకిలీ యస్ ఐ యువతి మాళవికను పోలీసులు అరెస్ట్ చేశారు.నార్కట్ పల్లి కి చెందిన మాళవిక నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, 2018లో అర్.పి.ఎఫ్ ఎస్ఐ పరీక్ష రాసి దాదాపు అన్ని అర్హతలు సాధించింది. కానీ మెడికల్ చెకప్‌లో దృష్టి లోపం కారణంగా తిరస్కరణకు గురైంది.అయితే అప్పటికే తల్లిదండ్రులతో పాటు బంధువులకు తాను ఎస్ఐ అవుతున్నట్లు చెప్పుకుంది.తన పరువు పోతుందని భావించిన మాళవిక ఎస్ఐ యూనిఫాం కుట్టించుకోవడంతో పాటు, నకిలీ ఐడి కార్డ్ చేయించుకుంది. అయితే ఇక్కడ వరకు బాగానే ఉన్నా పెళ్లి చూపులకు కూడా యూనిఫాంలో వెళ్లి అర్.పిఎఫ్ ఎస్ ఐ అని చెప్పడంతో సదరు అబ్బాయి బంధువులు ఆరా తీయడంతో నకిలీ బాగోతం బయటపడింది.విషయం తెలుసుకున్న అర్.పి.ఎఫ్ పోలీసులు మాళవికను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉద్యోగం రాలేదంటే తన తల్లిదండ్రులు బాధపడతారని ఇలా చేసినట్టు యువతి తెలిపారు.



# మురుగునీటితో కూరగాయలు పండిస్తున్నారా?

- **రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు**
- **చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ**
- **సూచనల అమలుపై 4 వారాల్లో చర్యలు తీసుకోవాలి**

**విశాలభారతి, హైదరాబాద్:**

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని చెరువుల మురుగునీటితో కూరగాయల సాగును అడ్డుకోవడానికి వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మురుగునీటితో సాగైన కూరగాయలు, ఆకుకూరలు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని, అందువల్ల అవి మార్కెట్లోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 13 చెరువుల దుస్థితిపై అడ్వొకేట్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని సూచనల అమలుపై 4 వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కార్యాచరణ నివేదికను ఫొటోలతో సహా సమర్పించాలని ఆదేశించింది.
నగరంలోని చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంపై 2007లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాఖ్యపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె. అనిల్ కుమార్లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ధర్మాసనం ఏర్పాటు చేసిన అడ్వకేట్ కమిషన్ మహా నగరంలోని పలు చెరువుల దుస్థితిపై ఫోటోలతో సహా నివేదిక సమర్పించి పలు సూచనలు చేసింది. చాలా చెరువులు అక్రమణలకు గురయ్యాయని చెత్తాచెదారం, మురుగునీటితో దుర్గంధభరితంగా తయారయ్యాయని అడ్వొకేట్ కమిషన్ పేర్కొంది. ఈ చెరువుల్లోని మురుగునీటితో పండించిన ఆరు కూరలు, కూరగాయలతో పాటు చేపలను వినియోగిస్తున్న ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం చూపిస్తోందని తెలిపింది.
వ్యర్థాలను తొలగించడం, పూడిక తీయడం, ఆక్రమణలను తొలగించడంతోపాటు నాలాలను పరిరక్షించి నీటి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అడ్వకేట్ కమిషన్ పేర్కొంది. చెరువుల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు తదితర కేసుల సత్వర పరిష్కారానికి హైకోర్టు పరిధిలో గ్రీన్ బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.



ఎఫ్‌టీఎల్ నిర్ధరణ శాస్త్రీయంగా చేసి తుది నోటిఫికేషన్ ఇవ్వాలని ఆక్రమణదారులపై చర్యలు తీసుకునేలా నీటిపారుదల శాఖకు తగిన అధికారాలు కల్పించాలని అడ్వకేట్ కమిషన్ నివేదికలో తెలిపింది. అడ్వకేట్ కమిషన్ నివేదికను చెరువుల వారీగా అమలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది.



# ద్విచక్ర వాహనాల దొంగన అరెస్ట్

**విశాలభారతి,కీసర :** కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారం మారుతి గార్డెన్స్ వద్ద మంగళవారం వాహనాలు కీసర పోలీసులు తనిఖీలు చేశారు. ఆ తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి అనుమానంగా బైక్ పై వెళ్తున్న వ్యక్తిని అపి బైక్ కి పేపర్స్ అడిగారు. అనుమానంతో పట్టుకునన్ వ్యక్తిని విచారించగా మూడు కమిషనరేట్ పరిధిలో మొత్తం అరు కేసులో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు గుర్తించారు.అతని వద్ద నుండి ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు.నిందితుడు సాయి సాగర్ స్వస్థలం యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డి పల్లీ వాసి.ప్రస్తుతం నాగారం మున్సిపాలిటీ రాంపల్లీ అర్ ఎల్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.వృత్తి రీత్యా స్విగ్గి ఫుడ్ డెలివరీ బాయ్ గా పని చేస్తున్నాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని రిమాండ్ కి తరలించిన కీసర పోలీసులు.ఈ వాహన తనిఖీల్లో క్రైం ఎస్ ఐ హరి ప్రసాద్,కానిస్టేబుల్ ఇంద్రసేన రెడ్డి,వెంకట్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.






# మల్కాజిగిరి ప్రజలు బిజెపి వైపే

- నేను లోకల్
- మల్కాజిగిరంటేనే మిని ఇండియా
- ఈటెల రాజేందర్.

**విశాలభారతి,కీసర :** కీసర మండల కేంద్రంలోని కరింగూడ గ్రామంలో ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతుల సమావేశంలో మాజీ మంత్రి బిజెపి పార్టీ మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్,డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజల ఆశీర్వాదం నాపై ఉంది అని అన్నారు.ఎక్కడికి పోయిన అయ్య ఈసారి ఓటు మోడీకే వెస్తం అని అంటున్నారని అన్నారు.టిఆర్ ఎస్ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ వారు కూడా మోడీకే ఓటు వేస్తామని అంటున్నారని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నన్ను బయట వ్యక్తి అని ప్రశ్నిస్తున్నాడు కానీ నేను లోకల్ వ్యక్తినే అది తెలుసుకో రేవంత్ రెడ్డి అని గుర్తుచేశారు. నా ఇల్లు ఉంది శామీర్ పెట్ దేవరయంజల్ లో అని అన్నారు.మల్కాజిగిరి లో బిజెపి పార్టీ గెలుపు కయం అని అన్నారు.దమ్ముంటే స్థానికుడిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెట్టు కానీ ఎక్కడో ఉన్న వారిని తీసుకొని వచ్చి డబ్బులతో ఓటర్లను కొనలేవని అన్నారు. మల్కాజిగిరి అంటే దేశంలోనే మిని ఇండియా అని అన్నారు.ఇక్కడి ప్రజలు చాలా తెలివి అయిన వారు అని అన్నారు.మంచి వాళ్లకు ఎప్పుడు న్యాయమే చేస్తారు అని అన్నారు.తెలంగాణలో అత్యధిక ఓట్ల మెజరిటీతో మల్కాజిగిరి ఎంపి సీటు ప్రధాన మంత్రికి బహుమతిగా ఇవ్వాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పట్లోళ్ళ విక్రంరెడ్డి,కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మర్పల్లీ అంజయ్య యాదవ్, పడమటి జగన్ మోహన్ రెడ్డి, ఏనుగు సుదర్శన్ రెడ్డి, బుద్ది శ్రీనివాస్, కొమ్మిడి శోభా రెడ్డి, జిల్లాల తిరుమల రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, అచ్చిని నర్సింహ, సింగిరెడ్డీ వెంకట్ రెడ్డి, కాలేరు రామోజీ, మునిగంటి సురేష్, దేశం మల్లేష్ గౌడ్, శ్యాం సుందర్ శర్మ, బండారు శ్రీనివాస్ రెడ్డి మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.




# మత్స్యకారులకు రక్షణ చట్టం తేవాలి

- ఓయూలో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం.

**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో తెలంగాణ ముదిరాజ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ముదిరాజ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణలోని 33 జిల్లాల ముదిరాజ్ విద్యార్థులు ముదిరాజ్ సంఘం నాయకులు హాజరయ్యారు. ముదిరాజులకు పదివేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ గారి ఆంజనేయులు ముదిరాజ్ నాయకులు హైకోర్టు అడ్వకేట్ రామారావు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం మేమేంతో మాకంత వాటా అన్ని రంగాల్లో కల్పించాలి. మత్స్యకారులకు రక్షణ చట్టం తీసుకురావాలి,అంతేకాకుండా ముదిరాజ్ విద్యార్థులకు హైదరాబాదులో హాస్టల్ వసతిని కల్పించాలి, బీసీ డీ నుండి బీసీఏకు రిజర్వేషన్ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొర్వి బాలకృష్ణ ముదిరాజ్ , ప్రధాన కార్యదర్శులు ఉమేష్,జీడి భీమ్ సేన్ ముదిరాజ్, ప్రకాష్, వెంకటేష్, ప్రదీప్, శ్రీకాంత్, కిషన్ ఆంజనేయులు,వెంకట రాములు పాల్గొన్నారు.



# పరామర్శ

**బాల్కొండ,విశాలభారతి:** ముప్కాల్ మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు.ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గద్దల సంతోష్ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. అలాగే అనికేషి రమేశ్ చేపలు పట్టడానికి వెళ్ళి మృతిచెందాడు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూలే ఆలోచనలు భవిష్యత్ తరాలకు అందించాలి

- డా.చలమల్ల వెంకటేశ్వర్లు

**సికింద్రాబాద్, విశాలభారతి:** మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనా విధానాన్ని నేటి తరానికి అందించాల్సిన ఆవశ్యకత ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ జ్యోతిబా పూలే రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమశాఖ సహకారంతో "నేషనల్ సింపోజియం కమ్ షార్ట్ టర్మ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ప్రజెంటేషన్స్ (20232024)" నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పూలే లోతైన భావజాలాన్ని పరిశోధించడం, ఆధునిక సామాజిక రాజకీయ రంగాల్లో వాటిని అన్వయించటం, విభిన్న దృక్కోణాలను అన్వేషించేందుకు విద్యార్థులు, యువత, పరిశోధకులు కృషి చేయాలని సదస్సులో పాల్గొన్నా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సింపోజియం నిర్వహణకు సహకరించిన ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఓయూ వీసీ ప్రో. డి. రవిందర్, రిజిస్ట్రార్ ఆచార్య పి. లక్ష్మీనారాయణ,కు డాక్టర్ చలమల్ల కృతజ్ఞతలు తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలుప్రాక్సిస్ మరియు సమకాలీన ఔచిత్యంపై అనే థీమ్ పై పలువురు పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. వ్యవసాయంపై మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలు, లెగసీ సమకాలీన పరిస్థితులకు అన్వయించటం అనే అంశంపై కేరళ కొట్టాయంకు చెందిన రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ అంజులిస్ కురియన్ ప్రసంగించారు. పూలే సామాజిక విప్లవ భావజాలం - ప్రభావం, ఆధునిక్ భారత ఆర్థిక, రాజకీయ వ్యవస్థ అనే అంశంపై బళ్లారికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజా మొహినుద్దీన్ మాట్లాడారు. పూలే వ్యవసాయ హేతువాదం సమకాలీన వ్యవసాయ రంగంపై అనే అంశంపై నిజాం కళాశాల అధ్యాపకులు డాక్టర్ సి.హెచ్ శృతి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ. జి. మల్లేశం హాజరయ్యారు. ప్రొ. సిహెచ్ శ్రీనివాస్, ప్రొ. మంగు, డాక్టర్ సయ్యదా అజీమ్ ఉన్నీసా, డాక్టర్ ఐ. ఇందిర, డాక్టర్ బి. అశోక్, డాక్టర్ అమ్మాన్యుయేల్, డాక్టర్ వి. వంశీధర్, డాక్టర్ సృజన ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# కంటోన్మెంట్ బీజేపీకి భారీ షాక్

- హస్తం గూటికి చేరిన శ్రీగణేష్.
- సాధారణ ఎన్నికల ముందు బిఆర్ఎస్
- ఆ తర్వాత బీజేపి. నేడు కాంగ్రెస్



**విశాలభారతి, కంటోన్మెంట్ :** తెలంగాణ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిని చవి చూసిన నాయకుడు శ్రీ గణేష్ పార్టీ మారారు. కంటోన్మెంట్ బీజేపీ కి భారీ షాక్ తగిలింది .ఇన్నాళ్లు బీజేపీ కోసం పని చేసిన ఆయన ఉపఎన్నికల ముందు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు. హస్తం పార్టీలో తనకు టిక్కెట్ వస్తుందని ఆశాభావంతోనే తాను పార్టీ వీడినట్లు స్పష్టంగా తెలుస్తుంది. కాగా పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ నియోజికవర్గంకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన చేసిన విషయం తెలిసిందే కాగా ఈ సందర్భం లో శ్రీ గణేష్ పార్టీ ని వీడడంతో ఒక్కసారిగా అవ్వక్కయ్యారు. సాధారణ ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్ తో కలిసి పని చేసిన శ్రీగణేష్ తనకు టిక్కెట్ దక్కకపోవడంతో ఆ పార్టీ ని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు,. ఆతర్వతా ఒక్కరోజు మాత్రమే పార్టీ లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి టిక్కెట్ దక్కుతుందని ఆశించి భంగపడ్డారు, తీవ్ర నిరాశలో ఉన్న శ్రీగణేష్ ఆ తర్వాత కాంగ్రెస్ ను వీడి రాత్రికి రాత్రే బీజేపీ కండువా కప్పుకున్నారు. పార్టీ పెద్దల అండతో నామినేషన్ దాఖాలు చేసే సమయానికి బీ ఫాం తెచ్చుకుని నామినేషన్ వేశారు.ఇలా ఆయన వెల్లని పార్టీ లేదు తిరుగని కార్యాలయం లేదు. చివరికి మల్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి ఉపఎన్నికల భరిలో నిలువాలని శ్రీగణేష్ ఉవ్విల్లూరుతున్నాడు. పూటకో మాట,రాత్రికో వేశం వేస్తున్న శ్రీగణేష్ కు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇస్తుందా లేదా అన్నది మాత్రం తెలియాల్సి ఉంది. అంతే కాదు కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తే స్థానిక ఓటర్లు ఆయన తీరను చూసి ఓట్లు వేస్తారాలేదా అన్నది తెలిసేందుకు జూన్ వరకు ఎదురు చూడాల్సిందే మరి..

**ఈటల ప్రచారం ముగిసిన వెంటనే శ్రీగణేష్ లో మార్పు..**

ఎంపీ ఎన్నికల ప్రచారం లో భాగంగా ఈ ఉదయం కంటోన్మెంట్ నియోజిక వర్గం లో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ తో కలిసి ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఈటలతో కలిసి శ్రీగణేష్ పాల్గొన్నారు.స్థానిక వెస్ట్ మారేడ్ పల్లిలో వాకర్స్ తో కలిసి ముచ్చటించారు. ఎన్నికల్లో బీజేపీని ఎందుకు గెలుపించుకోవాలో ఓటర్లకు తెలిపారు. మరో వైపు కేంద్రం లో బీజేపీ అధికారం లోకి వస్తే ఎటువంటి మార్పులు చేర్పులు తీసుకువస్తుందో వివరించారు. కాగా వాటన్నింటిని పక్కన పెట్టి కమలం పార్టీని వీడి హస్తం గూటికి చేరడం తో అందరు షాక్ లో ఉన్నారు. ఇన్నాళ్లు బీజేపీ కోసం తన కోసం పని చేసిన తన వర్గానికి ఎటునంటి క్లూ ఇవ్వకుండానే కాంగ్రెస్ లో చేరడంతో స్థానికులు తీవ్ర అంసతృప్తి లో ఉన్నారు.



# భీమ్‌గల్ బస్ డిపోను అభివృద్ధి చేయాలి

- మంత్రి పొన్నంకి మానాల మోహన్ రెడ్డి వినతి

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ బస్ డిపోను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలలో లబ్దిపొందాలనే ఆలోచనతో బస్ డిపోను పునః ప్రారంభించారని, కానీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో బస్సులను, సిబ్బందిని గాని నియమించడం జరగలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు.పునః ప్రారంభమైన భీమ్‌గల్ బస్ డిపోను పూర్తిస్థాయిలో సిబ్బందిని, బస్సులను ఏర్పాటు చేసి భీమ్‌గల్ చుట్టుప్రక్కల ఉన్నటువంటి గ్రామ ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే విధంగా ప్రయత్నించి,డిపోకు సకల సౌకర్యలు ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కేశ వేణు,నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీల్లో డబ్బులు సీజ్



**వనపర్తి,విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పరిధిలో మంగళవారం వాహనాల తనిఖీలు చేశారు. తనిఖీల్లో పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నూల్ బైపాస్ రోడ్డు చెక్ పోస్ట్ దగ్గర వాహనల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి కర్నూలు నుండి వీపనగండ్లకు తన యొక్క కారులో నంబర్ AP 31 SV 7136 దానిలో 90,300/ రూపాయలు ఉండగా అట్టి రూపాయలకు ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున సీజ్ చేశారు. వనపర్తి జిల్లాలో మొత్తం 90,300/రూపాయలు పట్టుబడినవి.

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైన 50వేల రూపాయల కొద్దీ ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని ఒక వేళ తీసుకెళ్తే రసీదు, తగిన పత్రాలు వాటి వివరాలు ఉండాలని అన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లారాధని ఎస్సై తెలిపారు.





# బీజేపీతోనే దేశాభివృద్ధి, సుస్థిర పాలన..

- మారేడ్పల్లి లో మార్నింగ్ వాకర్స్ తో ఈటల భేటీ..

**కంటోన్మంట్ , విశాలభారతి:** భారతదేశ పురోభివృద్ధి కోసం, సుస్థిర, సంక్షేమ పాలనకోసం మోదీ ని, ఆయన పంపిన నన్ను నిండుమనసుతో ఆశీర్వదించారనివిజ్ఞప్తి చేశారు.. ఎటువంటి మచ్చలేకుండా నిస్వార్థంతో నిత్యం అందుబాటులో ఉంటాని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని.. వెస్ట్ మారేడ్పల్లి,నెహ్రూ నగర్ పార్కులో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులను కలిసారు,మార్నింగ్ వాకర్స్ తో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు.వారి సమస్యలను అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉంటే నాయకున్ని ఎన్నుకోవాలని, పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీగణేష్,బిజెపి మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్,ఓ.బి.సి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిట్ల నాగేష్ ,బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

- మద్యం సీజ్

**మంచిర్యాల, విశాలభారతి:** మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం స్థానిక పోలీసులు బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.సమాచారం మేరకు పోలీసులు బెల్ట్ షాపులపై దాడి చేయగా మందమర్రి 1జోన్ కి కొనగంటి సురేష్ తండ్రి చంద్రయ్య వయసు 63 సంవత్సరములు , కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తాడు, అతను నడుపుతున్న కిరాణా దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న 74.91 లీటర్ల మద్యాన్ని పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ దాడులలో పాల్గొని అక్రమమద్యాన్ని సీజ్ చేయడంలో కీలక పాత్ర పోషించిన మందమరి ఎస్సై రాజశేఖర్ ను, పోలీస్ సిబ్బందిని సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, మందమర్రి సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# నాలుగేండ్లు అభివృద్ధికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు

- మాజీ చైర్మన్ గట్టు యాదవ్, తాజా మాజీ వైస్ చైర్మన్ వాటికి శ్రీధర్

**వనపర్తి,.విశాలభారతి:** వనపర్తి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ గా 2020 సంవత్సరంలో జనవరి 27న పదవి బాధ్యతలు స్వీకరించిన విషయం అందరికీ తెలిసిందే. బిఆర్ఎస్ కౌన్సిలర్లు అంతర్గత చిచ్చులు పెట్టడం వల్లే అవిశ్వాసం అంశం తెర పైకి వచ్చిందని తాజా మాజీ చైర్మన్ గట్టు యాదవ్, తాజా మాజీ వైస్ చైర్మన్ వాటికి శ్రీధర్ లు అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనాప్పటికీ నాలుగున్నర సంవత్సరాలు పాటు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధిలో భాగస్వామ్యం అయినందుకు గర్వపడుతున్నారు. మాజీమంత్రి నిరంజన్ రెడ్డి సారథ్యంలో కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. దశాబ్దాల చరిత్రలో మున్సిపాలిటీ అభివృద్ధి జరిగిన ఘనత బిఆర్ఎస్ పార్టీ వల్లే అని తెలియజేశారు. పుర ప్రజలకు సేవలు అందించడం ఇకపై మరిన్ని సేవలందించడం కోసం మా వంతు కృషి చేస్తామన్నారు. మంగళవారం చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు రాజీనామా లేఖ మున్సిపల్ కమిషనర్ మైస పూర్ణచందర్ కు అందజేశారు. రాజీనామా పత్రం అందించే సమయంలో చైర్మన్ గట్టు యాదవ్ బరువెక్కిన హృదయంతో అందించినట్లు కనిపించడం విశేషం. చైర్మన్ గట్టు యాదవ్ వైస్ చైర్మన్ వాటికి శ్రీధర్ లు పట్టణ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుమూర్తి యాదవ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, సయ్యద్, జమీల్, కౌన్సిలర్ సభ్యులు కాగితాల లక్ష్మీనారాయణ, పుట్టపాకల మహేష్, పాకనాటి కృష్ణ, నాగన్న యాదవ్, భాష నాయక్, నాయకులు ఉంగ్లం తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, శరవంద, స్టార్ రహీం, ఎల్ఐసి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com





# ఇటికలు పట్టుకోవడమే తెలుసు...
# నేటి నుంచి అక్షరాలు నేరుస్తున్నారు..

■ జిల్లా ఎస్పీ శ్రీమతి రక్షిత కె మూర్తి

**వనపర్తి, విశాలభారతి**: జిల్లా కేంద్రంలో ఇటుక బట్టీల లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు విద్య దూరం కావడంతో మానవతా దృక్పథంతో జిల్లా ఎస్పీ రక్షిత కె. మూర్తి ఎన్జీవో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వర్క్ సైట్ కేంద్రానికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చదువు ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమైనది దాని నిర్లక్ష్యం చేసి జీవితంలో అధోగతి పాల వద్దని అన్నారు. ఇటుకలు పట్టుకోవడం అలవాటు చేసుకున్న వారి చిన్ని చేతులు మొదటిసారిగా స్లేట్ లను పట్టుకున్నాయని అన్నారు. వారిలో చాలామంది ఇంతకు ముందు స్కూల్ డ్రెస్ వేసుకోలేదు లేదా సరైన స్కూల్‌కి వెళ్లలేదు. కాబట్టి, ఈ రోజు మంగళవారం రోజున వనపర్తి జిల్లా మెట్టుపల్లి గ్రామంలో ఒడిశాకు చెందిన ఇటుక బట్టీ కార్మికుల పిల్లల కోసం పని ప్రదేశంలో సంరక్షణ కేంద్రం వర్క్‌సైట్ పాఠశాలను ప్రారంభించినప్పుడు, వారు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారు వారి వయస్సును బట్టి కొత్త యూనిఫారాలు, స్లేట్లు లేదా నోట్ బుక్‌లు, పాఠ్య పుస్తకాలు, పెన్సిళ్లు ,పెన్నులు పొందారు. జిల్లా ఎస్పీ శ్రీమతి రక్షిత కే మూర్తి, ఏడీ ఎట్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ (ఎన్జీవో)G. సురేష్ గారు మరియు చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సిడిపిఓ) ఆధ్వర్యంలో 49 మంది వలస కూలీల పిల్లలను పాఠశాలలో చేర్పించి తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎయిడ్ ఎట్ యాక్షన్ మల్టీగ్రేడ్ టీచింగ్‌లో శిక్షణ పొందిన వాలంటీర్ ఉపాధ్యాయులలను ఏర్పాటు చేయనైనది వారు 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నర్సరీ నుండి నుండి 2 తరగతి వరకు తరగతులు తీసుకోవడం ప్రారంభించారు. ఎన్జీవో పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు బూట్లు యూనిఫామ్, పెన్సిల్లు నోట్ పుస్తకాలు పలుకలు పెన్నులు మొదలగునవి ఇవ్వడం జరిగింది. చైల్డ్ డిపార్ట్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీమతి కృష్ణ చైతన్య వారి ఆధ్వర్యంలో పప్పు బియ్యం కోడిగుడ్లు బాలామృతం మొదలగు పోస్ట్ కి ఆహారము ఇవ్వనైనది పాఠశాల పర్యవేక్షణను కూడా అందిస్తోంది.ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ సిడిపిఓ సిబ్బంది ,వనపర్తి డిఎస్పి శ్రీ జే వెంకటేశ్వరరావు , వనపర్తి సీఐ శ్రీ నాగభూషణం , ఆత్మకూరు సిఐ శ్రీ శివ కుమార్, ఇన్చార్జి ఎస్ఐ అంజద్ ,వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న , రామరాజు , భరోసా సెంటర్ సిబ్బంది షీ టీం సిబ్బంది పాల్గొన్నారు

# బెల్టు షాపులో మద్యం పట్టివేత

**ఆర్మూర్ ,విశాలభారతి:**
ఆర్మూర్ నియోజకవర్గం లోని మక్లూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం బెల్ట్ షాప్ పై టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడి చేశారు, నిజామాబాద్ టాస్క్ ఫోర్స్ ఏసిపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, సిబ్బంది రాములు, లక్ష్మణ్ ,అనిల్ కుమార్ ,సుదర్శన్, లు బెల్టు షాప్ (వైన్స్)పై దాడి చేశారు దాడిలో బెల్ట్ షాపులో123.250 లీటర్ల (30,210) రూపాల విలువ) మద్యం ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు తదుపరి చర్యల కొరకు మక్లూర్ ఎస్ హెచ్ ఓ కి అప్పగించారు.





# వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య

**సైదాపూర్, విశాలభారతి:**
మండలంలో పేర్కపల్లి గ్రామానికి చెందిన పోతరాజు ఓదయ్య (85)మతిస్థిమితం లేక పురుగుల మందు తాగి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతు మృతి చెందాడని సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓదయ్యాకు పొలాల వద్ద పురుగుల మందు దొరకడంతో సోమవారం ఉదయం అందాద 9:30 గంటలకు తాగాడని చెప్పారు. అస్వస్థతకు గురైన అతన్ని 108 ద్వారా హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం లో చేర్పించారు.వైద్య సేవలు పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకు మృతి చెందాడని ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

# ధర్పల్లి ఎస్సైగా భూపల్లి విక్రమ్

**విశాలభారతి,ధర్పల్లి:**
ధర్పల్లి ఎస్సైగా భూపల్లి.విక్రమ్ పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ధర్పల్లి ఎస్సైగా పనిచేసిన వంశీకృష్ణ రెడ్డి ఎడపల్లికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎడపల్లిలో పనిచేసే విక్రమ్ బదిలీపై ధర్పల్లి ఎస్సైగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... మండల కేంద్రంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తానని ఎవరికి ఏ ఆపద వచ్చిన డయల్ (100 ) హండ్రెడ్ కు కాల్ చేయాలని, ఎన్నికలు వస్తున్న సందర్భంగా ఎన్నికల నియమావళి ప్రజలందరూ పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



# లంబాడి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తా

■ లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సేవలాల్

**బాల్కొండ,విశాలభారతి**:
బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం రహత్ నగర్ గ్రామానికి చెందిన భుక్య సేవలాల్ ను భీమ్‌గల్ మండల లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షునిగా నియమిస్తూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు చౌహాన్ మోహన్ నాయక్ నియమకపత్రం జారీ చేశారు.లంబాడి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తానని సేవలాల్ తెలిపారు.లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# అవిశ్వాసం ఇక లేనట్టేనా...!

- టిఆర్ఎస్ కౌన్సిలర్ల అంతర్గత చిచ్చుల వల్లే అవిశ్వాసం
- చైర్మన్ , వైస్ చైర్మన్ పదవుల రాజీనామాలు
- అవిశ్వాసం పై మూడు నెలపాటు తర్జనభజన
- అధిష్టానం మేరకే చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కేటాయింపు
- ఇప్పటికే నలుగురు పేర్లు ప్రస్తావించిన, ఆశవాహులు
- కొత్తగా ఎన్నుకోనున్న చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎవరై ఉంటారని సర్వత్ర ఉత్కంఠ



**వనపర్తి, విశాలభారతి:**
వనపర్తి మున్సిపాలిటీలో చాలా రోజులుగా అవిశ్వాసం పెట్టేందుకు టిఆర్ఎస్ కౌన్సిలర్లు చేసిన ప్రయత్నాలకు మంగళవారం చెక్ పడింది. వనపర్తి మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై ఏనాడు లేనివిధంగా అవిశ్వాసం పెట్టడం చరిత్రలో ఒక మచ్చగా మిలుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. అయితే చాలా రోజుల నుంచి వనపర్తి మున్సిపాలిటీలో చైర్మన్ గట్టు యాదవ్ ,వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ల పై తరస్థాయిలో వ్యతిరేకం రావడం వల్ల అవిశ్వాసం పెట్టేందుకు చాలావరకు కసరతులు చేసినప్పటికీ బిఆర్ఎస్ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర రెడ్డి పలుమార్లు సర్ది చెప్పి అవిశ్వాసానికి వెళితే ప్రతిపక్షాల ముందు నెగటివ్ ఫీడ్ బ్యాక్ వస్తుందని భావించిన అధిష్టానం వారి మాటలను సైతం పక్కనపెట్టి గత నెల 26 తారీఖున 24 సంతకలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అవిశ్వాసం పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్న చైర్మన్ గట్టు యాదవ్ , వైస్ చైర్మన్ వాటికి శ్రీధర్ పదవులకు రాజీనామా చేసిన లేఖను మున్సిపల్ కమిషనర్ మైసా పూర్ణ చందర్ కు అందజేశారు. అవిశ్వాసం పెట్టేందుకు బిఆర్ఎస్ లోనే రెండు వర్గాలుగా చిలిన కొందరిలో మొదటగా చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ పేర్లు కొన్ని రోజులుగా ప్రచారంలో ఉన్న తాజాగా చైర్మన్ వైస్ చైర్మన్ ఎవరిని ఎన్నుకోబోతున్నారు అన్నా దానిపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ లోకి బిఆర్ఎస్ కౌన్సిలర్లు చేరడంతో బిఆర్ఎస్ లో ఉన్న మరికొందరు అంతర్గతంగా ఎమ్మెల్యేగా టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. టిఆర్ఎస్ అధిష్టానం మాటలు విని 2/3 నిష్పత్తి ప్రకారం టిఆర్ఎస్ కౌన్సిల్ సభ్యులే చైర్మన్ వైస్ చైర్మన్ గా ఎన్నిక కావచ్చు కానీ ఉన్నపలంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాజకీయ చతురత ప్రదర్శిస్తే కాంగ్రెస్ పార్టీ కి చెందినవాళ్లు చైర్మన్ వైస్ చైర్మన్ గా కొనసాగితే కూడా ఆశ్చర్య ఉనవసరం లేదు. శుక్రవారం చైర్మన్ వైస్ చైర్మన్ రాజీనామా చేయకపోయి ఉంటే ఈనెల 27న అవిశ్వాసానికి సమావేశం ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలయ్యి ఉండేది. కానీ కొత్తగా ఎన్నుకునే చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం ఎవరు పోటీ పడుతున్నారు అన్నదానిపై నెలకొన్న సందిగ్ధం



# ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి మండల అధ్యక్షుడి నియామకం

**భీమదేవరపల్లి విశాలభారతి:**
ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కమిటీ సమావేశం హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్ పి జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ హాజరై నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా నక్క సునీల్ మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షునిగా పర్నందుల సురేష్ మాదిగ నియమించారు .అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించుకోవడంతోపాటు సామాజిక న్యాయమే జెండాగా జాతిలో రాజకీయ చైతన్యాన్ని నింపి పోరాటాన్ని ఉధృతం చేయాలని అన్నారు. పోరాట వీరులుగా గుర్తింపు పొందిన మాదిగ బిడ్డలు రాజకీయ చైతన్యాన్ని నింపుకొని మహనీయులు కలలుగన్న మహజన రాజ్య స్థాపన కోసం సామాజిక పరివర్తకులు మహాజననేత మాన్య శ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమించాలని కోరారు.అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కనకం రాజ్ కుమార్ నాగిళ్ల శ్రీకాంత్ అధికార ప్రతినిధి మిట్టపల్లి రమేష్ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి దిలీప్ కార్యదర్శులు గజ్జల అనిల్ కుమార్ కిరణ్ సాంబరాజు ఎమ్మెస్ పి ఉపాధ్యక్షుడు కాదాసు ప్రవీణ్, మాడుగుల ప్రభుదాస్, అధికార ప్రతినిధులు జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా సహాయ కార్యదర్శి నగిలా చందర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అధ్యక్షులుగా ఎన్నికైన సునీల్, సురేష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ కి, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.మాదిగ ఉపకులాల ప్రజలతోపాటు సమాజంలోని సబ్బండ వర్గాలనేకం చేస్తూ సామాజిక న్యాయమే లక్ష్యంగా నూతనమైన రాజకీయ పోరాటానికి సిద్ధం చేస్తామని ఆ దిశగా అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు.



# కుష్టువ్యాధిపై ఆందోళన వద్దు

■ డా. రూబీన

**భీమదేవరపల్లి,విశాలభారతి:**
కుష్టువ్యాధిపై భయాందోళన వద్దని పరీక్షలు చేయించుకుని మందులు వాడితే నివారణ సాధ్యమేనని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రుబీనా పేర్కొన్నారు. కుష్టువ్యాధి నివారణపై మంగళవారం భీమదేవరపల్లి లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవ గాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కృష్ణ వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు .మండలంలో ఎవరిరకైన కుష్టు వ్యాధి సోకితే వంగర పీహెచ్సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారికి ఆస్పత్రిలోనే ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం ఈనెల 24 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కె.ఎల్.ఎన్ స్వామి ఏఎన్ఎం స్వరూప,స్వరూప ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# పార్లమెంట్ ఎన్నికలు అన్ని ఏర్పాట్లు

■ దర్పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించిన డిపిఓ తరుణ్.

**విశాలభారతి, దర్పల్లి** :
పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా డిపిఓ తరుణ్ ధర్పల్లి మండలంలోని పోలింగ్ కేంద్రమైన జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను మినరల్ వాటర్, సానిటేషన్, ర్యాంపు పనులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం దుబ్బాక గ్రామంలో స్మశాన వాటికను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో. బాలకృష్ణ, ఎంపీఓ. రాజేష్, ధర్పల్లి గ్రామ కార్యదర్శి సైపోద్దీన్, దుబ్బాక కార్యదర్శి రాజ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

■ ధర్పల్లి గ్రామ పంచాయితీ కార్యదర్శి సైపోద్దీన్

**విశాలభారతి,ధర్పల్లి**:
ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రతి వీధి వీధిన పారిశుద్ధ పనులను పరివేక్షిస్తున్నామని ధర్పల్లి పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్ తెలిపారు.

**ఈ సందర్భంగా కార్యదర్శి సైపోద్దీన్ మాట్లాడుతూ.....**
ధర్పల్లి మండల కేంద్రంలో ప్రతి వార్డు,వీధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరియు బహిరంగంగా చిత్త వేసిన ప్రదేశాలలో వ్యర్థాలను తగలబెట్టి శుభ్రపరచామని అలాగే ప్రతిరోజు చెత్త ట్రాక్టర్ వచ్చే సమయానికి తడి చెత్త,పొడి చెత్త వేరువేరుగా తీసి ట్రాక్టర్లో వేసి, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఇందుకు గ్రామ ప్రజలు సహకరించగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కరోబార్ గంగాధర్ గౌడ్, సమెందర్,వాటర్ మ్యాన్ రాజేందర్, డ్రైవర్ సంతోష్ మరియు పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధిస్తాం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**
వీరనారి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఉక్కు మహిళ కామ్రేడ్ మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతిని సందర్భంగా సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో స్వరాజ్యం గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన నాటి తెలంగాణ సాయుద రైతంగా పోరాటంలో కీలక భూమిక పోషించిన గొప్ప విప్లవ యోధురాలు మల్లు స్వరాజ్యం అని అన్నారు. దున్నే వాడికి భూమి కావాలని, వెట్టిచాకిరీ అంతం కావాలని, నైజం నిరాంకుశ పాలన నుండి ప్రజల్ని విముక్తి చేయాలనీ తన 13వ ఏటనే ప్రజలను తన పాటలతో, మాటలతో ఐక్యం చేసి చైతన్యం చేసిందని అన్నారు. ఆనాటి నైజాం ప్రభుత్వం మహిళల్ని ఎన్నో చిత్రహింసలకు గురి చేస్తే వారికీ అండగా నిలబడి పోరాటం చేసింది అన్నారు. 2 సార్లు MLA గా ఎన్నికై నిస్వార్ధంగా, ప్రజాస్వామ్య యుతంగా పని చేస్తూ నిజమైన ప్రజా ప్రతినిధులు అంటే ఎలా ఉండాలో ప్రజలకు సేవ చేసి చూపించారు. కానీ నేటి ప్రభుత్వాలు పెట్టుబడుదారులకు, భూస్వాములకు కొమ్ముకాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కార్పొరేట్ పెద్దలకు లాభలు చేకూరుస్తూ ప్రజలపై భారలు మోపుతున్నాయని అన్నారు. అలాంటి విధానాలను తిప్పికొట్టడం కోసం ప్రజల్ని చైతన్యం చేసి పోరాటం వైపు నడిపించడమే మల్లు స్వరాజ్యంకి అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యంజె ప్రకాష్ కారత్, సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు ఏం .సత్యనారాయణ, ఐ.భాస్కర్, బి.శంకరయ్య, జె ఆశీర్వాదం, ఎన్.యాదగిరి, యం.విజయ్ కుమార్, యం . యాదయ్య, కె.వెంకటకృష్ణ, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు



# డివిజన్ లోని సమస్యలను పరిష్కరిస్తా

■ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

**ఎల్బీనగర్, విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్ రంగనాయకుల గుట్టలో ఉన్నటువంటి వరదనీటి కాలువలో చెత్తాచెదారం చేరి దుర్వాసనతో దోమలు పెరిగి కాలినీ వాసులు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని కాలనీ వాసులు సమాచారం ఇవ్వడంతో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి సమస్యను పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వరద నీటి కాలువను శుభ్రం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో AE చంద్ర శేఖర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలభారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com





# రైతు సంక్షేమమే ధ్యేయం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** సహకార సంఘాలు రైతుల సంక్షేమం కోసం పనిచే స్తాయని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ లోని రొక్కం సత్తి రెడ్డి గార్డెన్ లో సహకార సంఘం 50 సర్వసభ్య సమావేశం సత్తయ్య అధ్యక్షత న నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంక్ సెక్రటరీ వై.రాందాస్ గడిచిన ఆరు నెలల కాలంలో జరిగిన ఆర్థిక లావాదేవీల జమ, ఖర్చులను చదివి వినిపించారు.అనంతరం సత్తయ్య మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరం లో సంఘం దాదాపు 3 కోట్ల 22 లక్షల పై చిలుకు నికర లాభం గడించిందన్నారు.సకాలంలో అప్పులు చెల్లించిన సభ్యులకు, ఖాతాదారులకు ఈ సందర్భంగా కృతజ్ఞత లు తెలియజేశారు. బ్యాంకు అభివృద్ధి కి అహర్నిశలు కృషి చేసిన సంఘ సిబ్బందిని కొనియాడారు.రైతులు ఇప్పటివరకు తీసుకున్న అన్ని రకాల రుణాలను, కిస్తులను సకాలంలో చెల్లించాలని కోరారు.సంఘం నుండి వ్యవసాయ అప్పు తీసుకొని అట్టి అప్పు నిలువ వుండి అప్పుదారు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు సంఘం నుండి వారి కుటుంబ సభ్యుల కు రూ 25 వేలు ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు.సభ్యులకు వ్యవ సాయ పనిముట్లు, యంత్ర పరికారములు మొదలగు వాటిపై సబ్సిడీని సంఘమే భరించి రైతులకు అందజే స్తుందన్నారు.రైతు రుణమాఫీ వారివారి 228 మంది ఖాతాలో దాదాపు 1 కోటి 45 లక్షలు జమ చేశామన్నా రు.కోహెడలో 5 ఎకరాల స్థలంలో డీసీసీబీ ఋణ సహ కారంతో 5 వేళా మెట్రిక్ టన్నుల సామర్థ్యంఆమె గల రెండు గోదాముల నిర్మించామంమెరు.1500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల శీతల గిడ్డంగి నిర్మాణ దశలో ఉన్నదని పేర్కొన్నారు.సంఘం ద్వారా పాటశాలల కు ఎల్ ఈ డి టీవీలు అందజేశామని తెలిపారు.వ్యవ సాయ కుటుంబానికి చెంది 4 గురు యువకులు కలిసి వస్తే జేసిబి కొనుగోలుకు ఋణాలు అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సహకార సంఘం మాజీ చైర్మన్ రొక్కం భీంరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, తుర్కయంజాల్
సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సభ్యులు సామ సంజీవ రెడ్డి, జక్క రాంరెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, చెక్క లక్ష్మమ్మ, శీలం లక్ష్మమ్మ, కౌన్సిలర్ కొంద్రు మల్లేష్, సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కొత్త చంద్రారెడ్డి, నాయకులు పుల్లగుర్రం విజయానంద రెడ్డి, సంపాతీశ్వర్ రెడ్డి, సుధాకర్, నిరంజనరెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఈ నెల 21న ఉచిత కంటి వైద్య శిబిరం

**కల్వకుర్తి, విశాలభారతి:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈనెల 21న గురువారం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, కంటి చూపు మందగించిన.. ఇతరత్ర కంటి సమస్యలు ఉన్న వారికి ఈ వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని రావాలని పిఆర్ఓ పాషా తెలిపారు.




# నీటి సమస్య లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యం

- **మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి**

**మునగాల, విశాలభారతి:** మండల పరిధిలోని నేలమర్రి గ్రామంలో నీటి సమస్యను గుర్తించి త్రాగు నీరు కోసం నీటిపారుదల & పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు మరియు కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నేలమర్రి ఎస్సీ కాలనీకి గ్రామాలకు రెండు లక్షలు రూపాయలు మంజూరు చేయటం జరిగింది. ఈరోజు నేలమర్రి ఎస్సీ కాలనీ లో బోరు పైప్ లైన్ కి మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైప్ లైన్ బోరు వేయించి మిట్ట గూడెం నేలమారి గ్రామాలకు ప్రజల 10 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించటం జరిగిందని తెలియజేశారు.



# కమనీయం తిరుమలనాథుని కళ్యాణం

**చిట్యాల, విశాలభారతి**: జగత్ కల్యాణార్థం లోక రక్ష కుడైన శ్రీ భూదేవి సమేత శ్రీ తిరుమల నాథ స్వామి కళ్యాణ వేడుకని కన్నుల పండుగగా నిర్వహించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో తిరుమలనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రోజు శోభాయ మానంగా తీర్చిదిద్దిన కళ్యాణమండపంపై భూసమేతుడైన స్వయంభు భూసమేత తిరుమలనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేసి వేదమంత్రోచ్చారణల తో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో గణపతి పూజ, జిలకర బెల్లం క్రతువు పూర్తి చేసి 9 పోగులతో మూడు సూత్రాలతో మంగళసూత్రాన్ని చేసి మంగళ వాయిద్యాలతో తిరుమల నాథునితో అమ్మవారికి మూడు ముళ్ళు వేయించారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించి పూజలో కూర్చున్న దంపతులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం గంట్ల సురేందర్ రెడ్డి రజిత, ఓర్సు వెంకటేశం మంజుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకను తిలకించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ఆలయ చైర్మన్ ఓర్సు రాజకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ కాటం వెంకటేశం, ఎంపిటిసి నీతా రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కందిమల్ల రేణుక, శిశుపాల్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఎదుల్ల అజిత్ రెడ్డి, నూతి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

# స్వీయ అవగాహనే ఎయిడ్స్ వ్యాప్తిని అరికడుతుంది






**పటాన్ చెరు,విశాలభారతి** : ప్రతి ఒక్కరి స్వీయ అవగాహనే హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాప్తిని అరికడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం (టీఎస్ఏసీఎస్) మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో జీవ నైపుణ్యాల ద్వారా హెచ్ఐవి నివారణపై ఒకరోజు సదస్సును నిర్వహించింది. గీతమ్ లోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. టీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పినపాటి ప్రసాద్, కాకతీయ విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ పింగళి నరసింహారావు, టీఎస్ ఏసీఎస్ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ.ఎన్.స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు పాల్గొని, లెఫ్ట్ స్కిల్స్ ద్వారా హెచ్ఐవీ నివారణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విశ్వవ్యాప్తంగా, మనదేశంలో, ముఖ్యంగా తెలంగాణలోని హెచ్ఐవీ కేసుల భయకంరమైన గణాంకాలను ఈ సందర్భంగా వారు ప్రముఖంగా ప్రస్తావించారు. స్వీయ అవగాహన, సమస్య పరిష్కారం, నిర్ణయం తీసుకోవడం, విమర్శనాత్మక ఆలోచన, భావప్రకటన, భావోద్వేగం, ఒత్తిడిని అధిగమించడంతో సహా హెచ్ఐవీ నివారణలో సహాయ పడే పది ముఖ్యమైన జీవన నైపుణ్యాలను నిపుణులు వివరించారు. హెచ్ఐవీ వ్యాప్తిచెందే వివిధ మార్గాలు, వ్యక్తులపై దాని ప్రభావాన్ని కూడా చర్చించారు. సవాళ్లను అధిగమించే డానికి, జీవన నైపుణ్యాలను ఉపయోగించుకునేలా హెచ్ఐవీ సోకిన వ్యక్తులను వక్తలు ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. తొలుత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త నాగేంద్రకుమార్ అతిథులను స్వాగతించారు. ఇతర సమన్వయకర్తలు, పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

**ప్రముఖ కళాకారిణి డాక్టర్ నీనా ప్రసాద్ నృత్య ప్రదర్శన..**

ప్రముఖ కళాకారిణి డాక్టర్ నీనా ప్రసాద్ మోహినియాట్టం నృత్య ప్రదర్శన మంగళవారం గీతం యూనివర్సిటీలో జరిగింది. ఈ ప్రదర్శనను స్పిక్ మెకే హెరిటేజ్ క్లబ్ సహకారంతో స్టూడెంట్ లెఫ్ట్ డైరెక్టరేట్ నిర్వహించింది. గురువుకు నివాళిగా 'చొల్కెట్టుతో శాస్త్రీయ నృత్య పారాయణం ప్రారంభమైంది. తర్వాత వసుంధర సుందర ధార భూమి' ప్రదర్శన గాత్రానికి తగ్గ అభినయంతో అలరించింది. ఆ తరువాత ప్రతిభాతే రచించిన 'పద వర్ణనతో కొనసాగి, 'తిల్లానా'తో ముగిసి, ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచేసింది. మాధవన్ సంపూత్రి సీపీ (గానం), రమేష్ బాబు కేపీ (మృదంగం), అరుణ్ దాస్ సీపీ (ఇడక్క), కోలంక సాయికుమార్ (వయోలిన్) తదితరులు డాక్టర్ నీనా ప్రసాద్ కు సహకారం అందించారు. మోహినియాట్టం పారాయణం వంటి కార్యక్రమాల ద్వారా మనదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రచారం చేయడం గీతం, హైదరాబాద్ కొనసాగిస్తోంది.



# తనిఖీలు పటిష్టంగా చేయాలి

- **రాహుల్ హెగ్డే ఐపిఎస్, ఎస్పీ సూర్యాపేట**

**సూర్యాపేట, విశాలభారతి:** రూరల్ పీఎస్ పరిధి జాతీయ రహదారి 65పై జనగాం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బందికి సలహాలు, సూచనలు చేసినారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా నిబంధనల మేరకు వాహనాల తనికీలు పటిష్టంగా చేయాలని, అక్రమ రవాణా ను నిరోధించాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నామని, అంతరాష్ట్ర ఇంటిగ్రేటర్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని తెలిపినారు.ఈ కార్యక్రమం నందు డీఎస్పీ రవి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ ఐ బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.



# పాతాళ గంగ ను పైకి తేవడానికి భగీరథ ప్రయత్నం

**మోతె, విశాలభారతి:** మంగళ వారం మండల కేంద్రం లోని రైతు సాగునీటి కోసం పాతాళ గంగ ను పై కి రప్పించడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. అరు గాలం కష్టించి పని చేసి సాగు చేసిన వరి పంట సాగుకు సరిపడ నీరు లేక పొట్ట మీదకు వచ్చిన వరి పంట ఎండటానికి సిద్దంగా ఉండటం చేసేది లేక పాతాళం లో ఉన్న గంగమ్మ ను పైకి తెచ్చి పంటను కాపాడు కోవడం కోసం తిప్పలు తప్పడం లేదని పలువురు రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష కాలంలో అరు ఎకరాల భూమిని సాగు చేస్తే బావిలో ఉన్న నీరు సరి పోయేది ఏసంగి కి కనీసం మూడు ఎకరాలు కూడా నీటి పారుదల కావడం లేదని తెలిపారు మండలంలో కరువు ఛాయలు కమ్ముకొని కనిసం త్రాగటానికి కూడా నీటి కి కట కట అయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు చర్చించుకుంటున్ననారు.




# స్నేహితుడి కుటుంబానికి చేయూత

**నూతనకల్, విశాలభారతి:** జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 19911992 ఏడాది పదోతరగతి చదివిన ఎర్రపహాడు గ్రామానికి చెందిన శ్రీరామ ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న పూర్వ విద్యార్థులు ఉప్పలయ్య కుటుంబానికి చేయూత అందించాలని ముందుకు వచ్చారు. 1991 92 పదోతరగతి చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఎర్రపహాడు కు వెళ్లి మృతుడు కుటుంబాన్ని కలిగి ఉప్పలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ. 13 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ ఇరుగు బుచిమల్లు , నెలుట్ల కృష్ణయ్య, కోడి రవి, దీకొండ వెంకటేశ్వర్లు, ఎనిగతల కృష్ణయ్య, మొగుళ్ల రమేష్ తదితరులు పాల్గొని అందించారు.

# ఫోర్ వీలర్స్ వెళ్లకుండా స్టాపర్స్ ఏర్పాటు

- **ఆనందం వ్యక్తం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు**



**సూర్యాపేట, విశాలభారతి**: జిల్లా కేంద్రంలోని 65 నెంబర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై రిజిస్ట్రేషన్ ఆఫీస్ సమీపంలో ఉన్న మినీ అండర్ పాస్ వద్ద ట్రాఫిక్ సమస్యకు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం సమయంలో మినీ అండర్ పాస్ నుంచి ఫోర్ వీలర్స్, ఆటోలు వెళుతుండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మినీ అండర్ పాస్ నుంచి మధ్యకు ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా స్టాపర్స్ ను ఏర్పాటు చేసి ఫోర్ వీలర్స్, ఆటోలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. దీంతో అండర్ పాస్ నుంచి రోడ్డు దాటేవారికి ట్రాఫిక్ సమస్యలు తొలగి ప్రయాణం సాఫీగా సాగానుంది. మినీ అండర్ పాస్ వద్ద ట్రాఫిక్ ను నియంత్రించేందుకు స్టాపర్స్ ఏర్పాటు చేయడం పట్ల వాహనదారులు ప్రజలు ఆనందంగా వ్యక్తం చేస్తూ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాంకు కృతజ్ఞతలు తెలిపారు.



# తెలంగాణ వీరనారి మల్లు స్వరాజ్యం

- **ఆమె జీవితం స్ఫూర్తిదాయకం**
- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి**: వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రాయుని గూడెం లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు, తుంగతుర్తి మాజీ శాసన సభ్యురాలు మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన మల్లు స్వరాజ్యం స్మారక కళా వేదికను ఆయన ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ తరానికి ఆమె ఒక స్ఫూర్తి అని ఆమె పోరాటం అందరికీ ఆదర్శం అని అన్నారు. తుపాకీ పట్టి నిజాం కడగల్లాలించిన వీరవనిత మల్లు స్వరాజ్యమని గుర్తు చేశారు.ఆడవాళ్లు అబలలు కాదు సభలు అని నిరూపించిన యోధురాలు మల్లు స్వరాజ్యం అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ దుర్మార్గంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు వస్తుందని,ఇది ఆనాటి అమరవీరుల త్యాగానికి ద్రోహం చేసినట్టునని బిజెపి పై మండిపడ్డారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వమైన లౌకికత్వాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరి పైన ఉందని అన్నారు. దేశంలో బిజెపి మతసామరస్యాన్ని చెడగొట్టి మతోన్మాదాన్ని పెంచి పోషించాలన్న కుట్రలను అడ్డుకోవడానికి లౌకికవాద శక్తులు, రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని కోరారు. నమ్మిన ఆశయం కోసం కొట్లాడిన వీరవనిత స్వరాజమని ఆమె ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని అన్నారు. నాడు తుంగతుర్తి నియోజకవర్గంలో జరిగిన దాడులను, ఘర్షణలు హత్యల నుండి పార్టీ క్యాడర్ ను కాపాడిందన్నారు. నేటి యువత కు ఆమె జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటగా తుపాకీ పట్టిన మహిళాగా మల్లు స్వరాజ్యం కీర్తి ఘటించారని అన్నారు. మల్లు స్వరాజ్యమును పట్టిస్తే 10000 బహుమతి ఇస్తానని, ఆనాడు నైజాం ప్రకటించడం అంటే ఆమె ఎంత గొప్పగా పోరాడారో అర్థం అవుతుందన్నారు. మహిళ ఉద్యమానికి మల్లు స్వరాజ్యం దిక్సూచిగా దిగిచారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ రాజకీయ నాయకురాలు పాదూరి కరుణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులునెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సిపిఎం పార్టీ త్రీ టౌన్ కార్యదర్శిమేకన పోయిన శేఖర్,11వ వార్డు కౌన్సిలర్ఎడ్ల గంగాభవాని, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్గూరి వెంకటేశం, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుముత్యాల పిచ్చయ్య,ప్రముఖ న్యాయవాదిమల్లు కపోతం రెడ్డి ,విశ్రాంత ఉపాధ్యాయులు మల్లు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# అక్రమంగా మట్టి తరలింపు

- **ధ్వంసమైన తాగునీటి బోరు**
- **నీటి సరఫరా నిలిచిపోయి తండా ప్రజల ఇక్కట్లు**

**మరిపెడ, విశాలభారతి:** జిల్లా డోర్నకల్ నియోజకవర్గ మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని చోక్ల తండా శివారు గొల్లోని కుంటలో కొందరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. దీంతో చోట్ల తండా ప్రజలకు సరఫరాయే బోరు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. బాధిత తండావాసుల కథనం ప్రకారం మున్సిపాలిటీ కేంద్రం రెండో వార్డులోని చోట్ల తండా ప్రజల తాగునీటి సౌకర్యం తండా శివాని గుళ్లోని కుంటలో గత ప్రభుత్వ హయాంలో బోరు మోటర్ ఏర్పాటు చేయడం జరిగింది. వేసవిలో అక్కడి నుంచి తండాకు సైఫోన్ ద్వారా నీటి సరఫరా అవుతుంది. ఈ క్రమంలో మున్సిపాలిటీ కేంద్రంలోని బోడ అమృతంలకు చెందిన ఓ వ్యక్తి తన జెసిబినీ ఉపయోగించి రాత్రికి రాత్రే వందల ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించాడు. దీంతో తండాకు సరఫరాయే బోరు మోటర్ సైఫోన్ పైకి తేలి పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ప్రస్తుతం వేసవికాలం సంభవించడంతో మిషన్ భగీరథ నీటి సరఫరా కటకటగా మారింది. ఇటు బోరు మోటర్ ధ్వంసం కావడంతో పాటు అటు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తండా ప్రజలు తాగునీటికి తహతహలాడుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని తండావాసులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు మోటర్ సైఫోన్ ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తండా ప్రజలకు తాగునీరు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని చౌక్లా తండాకు చెందిన బానోతు నరేష్, కిషన్ బానోతు సుందర్ బానోతు పాండు, కీమా, బోడ కస్న, వీరన్న, రాము కోరుతున్నారు.

# 'కంగువ' టీజర్ రిలీజ్



నేషనల్ అవార్డ్ విన్నర్, స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ పాన్ వరల్డ్ మూవీ 'కంగువ' టీజర్ రిలీజైంది. ఈ టీజర్ విజువల్ వండర్ గా ప్రేక్షకుల్ని సర్ ప్రైజ్ చేసింది. కంగువ పాత్రలో సూర్య పోరాట యోధుడిగా కనిపించి ఆకట్టుకున్నారు. పులితో సూర్య చేసిన ఫైట్ సీక్వెన్స్ స్క్రీన్ మీదే చూడాలని అనిపించేలా ఉంది. హార్స్ ఫైటింగ్, బిగ్ షిప్ వార్ సీన్స్ తో వరల్డ్ సినిమా హిస్టరీలోని ఎపిక్ వార్ మూవీస్ ను 'కంగువ' టీజర్ గుర్తు చేసింది. హై క్వాలిటీ విజువల్స్ ను దేవిశ్రీ ప్రసాద్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మరింత ఎలివేట్ చేసింది. ఉధిరన్ తో కంగువ చేసిన రూత్ లెస్, ఫెరోషియస్ ఫైట్ టీజర్ లో హైలైట్ గా నిలిచింది. ఈ సినిమా కోసం హీరో సూర్య పడిన శ్రమంతా ఆయన మేకోవర్, క్యారెక్టర్ లో రిఫ్లెక్ట్ అయ్యింది. 'కంగువ' సినిమాను భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కంగువ' సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' మాస్సీ భగత్స్ బ్లేజ్ విడుదల



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పవర్ ప్యాక్డ్ మ్యాసివ్ యాక్షనర్ ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. భగత్స్ బ్లేజ్ టీజర్ ను విడుదల చేయడం ద్వారా మేకర్స్ ప్లజెంట్ సర్ ప్రైజ్ ఇచ్చారు. ఉస్తాద్ భగత్ సింగ్ తన రేంజ్ ని విమర్శించే వారికి ఘాటుగా సమాధానం ఇస్తాడు. "గాజు పగలే కొద్దీ పదునెక్కుద్ది.. గ్లాసంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం "అని కౌంటర్ ఇవ్వడం గూస్ బంప్స్ తెప్పించింది. హరీష్ శంకర్ పవన్ కళ్యాణ్ పాత్రను స్టైలిష్, పవర్-ప్యాక్డ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. పంచ్ డైలాగులు పవర్ ఫుల్ గా వున్నాయి. టీజర్‌లో పవన్ కళ్యాణ్ గన్స్ ఫైర్ చేయడం మెస్మరైజింగ్ గా వుంది. ఈ వీడియోలో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించారు. అయనంక బోస్ సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు అత్యున్నతంగా ఉన్నాయి. యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా వున్నాయి. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఆకట్టుకునే బ్యాగ్రౌండ్ స్కోర్‌తో పవన్ కళ్యాణ్ క్యారెక్టర్‌ని మరింతగా ఎలివేట్ చేశారు.

# ఓం భీమ్ బుష్ సెన్సార్ పూర్తి U/A సెన్సార్ సర్టిఫికేట్



శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, శ్రీ హర్ష కొనుగంటి, యువి క్రియేషన్స్ , వి సెల్యులాయిడ్ కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ ఓం భీమ్ బుష్ మార్చి 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధంగా ఉంది, ఓవర్సీస్ , కొన్ని ఇతర ప్రాంతాలలో 21న ప్రీమియర్లు ప్రదర్శించబడతాయి. ఈలోగ ఈ చిత్రం సెన్సార్ ఫార్మాలిటీని పూర్తి చేసి U/A సర్టిఫికేట్‌ను అందుకుంది. 'ఓం భీమ్ బుష్' పర్ఫెక్ట్ సమ్మర్ ఔటింగ్, ఇది యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను సమానంగా ఆకట్టుకోనుంది. కాలేజ్ లో బ్యాంగ్ బ్రోస్ ఫన్ ధమాకాతో సినిమా ప్రారంభమవుతుంది, ఆ తర్వాత భైరవపురం గ్రామంలో క్రేజీ రైడ్ ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్ తో పాటు, సినిమా చివర్లో భారీ ఎమోషన్‌తో ఊహించని ట్విస్ట్‌లతో అద్భుతంగా వుంటుంది. సినిమాలో హై ఎంటర్ టైన్ మెంట్ తో పాటు కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంటుంది. హిలేరియస్ వన్‌లైనర్లు మరింతగా అలరించనున్నాయి. శ్రీవిష్ణు కామిక్ టైమింగ్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ హిలేరియ పాత్రలు మేజర్ ఎట్రాక్షన్స్. రిపోర్ట్స్ పూర్తిగా పాజిటివ్‌గా ఉండడంతో మరో 3 రోజుల్లో సమ్మర్ ట్రీట్ అందించేలా భారీ అంచనాలతో సినిమా విడుదల కానుంది.



# 6 ఎఫ్ టీ పీ సి ఇండియా తెలుగు సినిమా వేదికగా మురళీమోహన్ స్వర్ణోత్సవ వేడుక



సీనియర్ నటులు మురళీ మోహన్ చలన చిత్ర పరిశ్రమలో అడుగిడిగి 50 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా మరియు తెలుగు సినిమా వేదిక సంస్థలు ఘనంగా సత్కరించాయి. సంస్థ అధ్యక్ష కార్యదర్సులు చైతన్య జంగా, వీస్ విజయ్ వర్మ పాకలపాటి, నిర్మాతల మండలి అధ్యక్షులు దామోదర ప్రసాద్, సెక్రటరీ ప్రసన్న కుమార్, వ్యాపార వేత్త కోగంటి సత్యం మరియు 20 మంది యువ కధానాయకుల సమక్షంలో పండితుల వేదమంత్రాల మధ్య మురళి మోహన్ ని ఘనంగా సత్కరించారు. ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మురళి మోహన్ మాట్లాడుతూ... అట్లూరి పూర్ణ చంధ్రరావు గారి చేతుల మీదుగా 33 వ ఏట కళామతల్లి ఆశీస్సులు పొందిన తాను నటునిగా, వ్యాపార వేత్తగా విజయవంతంగా రాణించానని, ఈ క్రమంలో తనకు తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృజ్ఞతలు తెలుపుకొంటున్నాని అన్నారు. ఇదే వేదికపై ఇటీవల జరిగిన ఎన్నికలలో వీరశంకర్ అధ్యక్షునిగా విజయం సాధించిన తెలుగు దర్శకుల సంఘం కార్యవర్గాన్ని మరియు శుభోదయం సుబ్బారావు నేతృత్వంలో విజయం సాధించిన తెలంగాణ మూవీ టెలివిజన్ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మురళి మోహన్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నిర్మాతల మండలి అధ్యక్ష కార్యదర్సులు దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్, ఉపాధ్యక్షులు వశిష్ఠ, తెలంగాణ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షులు రాజశేఖర్ తదితరులు మురళీ మోహన్ ఔనత్యాన్ని కొనియాడారు. స్వర్ణోత్సవ వేళ ఓ గొప్ప నటుడ్ని సత్కరించుకొనే అవకాశం రావడం పట్ల చైతన్య జంగా, విజయ్ వర్మ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రామ్ రావిపల్లి అందించిన ప్రశంసా పత్రం, మిమిక్రి రమేష్ చేసిన ఎంటర్టైన్మెంట్ సభికులను ఎంతగానో ఆకట్టుకొంది.

# సుహాస్ హీరోగా దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.4

గత ఏడాది బలగం వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ చిత్రాన్ని నిర్మించిన ప్రెస్టీజియస్ బ్యానర్ దిల్‌రాజు ప్రొడక్షన్స్ ఇప్పుడు క్రేజీ చిత్రాలను నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ సినిమాలను రూపొందిస్తోన్న ఈ నిర్మాణ సంస్థలో డిపరెంట్ రోల్స్‌తో మెప్పిస్తూ వెర్సటైల్ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్న సుహాస్ హీరోగా ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దిల్‌రాజు ప్రొడక్షన్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.4గా గత ఏడాది డిసెంబర్‌లో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. సుహాస్ జతగా సంకీర్తన విపిన్ నటిస్తుంది. నిర్మాత శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సలార్ చిత్రానికి డైలాగ్ రైటర్‌గా వర్క్ చేసిన సందీప్ రెడ్డి బండ్ల ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. లేటెస్ట్‌గా చిత్ర యూనిట్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. అందరూ మెచ్చే వినోదం ప్రారంభం అవుతుంది. మీ క్యాలెండర్‌లో మే 24ని గుర్తు పెట్టుకోండి. దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్ లో నాలుగో చిత్రంలో నేను నటిస్తున్నాను. మేం అద్భుతమైన కామెడీతో వేడి పుట్టించటానికి సిద్ధంగా ఉన్నాం అని సుహాస్ పేర్కొన్నారు. ఈ చిత్రం మే 24న థియేటర్స్‌లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చసింది. అందులో చిన్న పాట మహిళ న్యాయమూర్తిగా కనిపిస్తోంది. చిన్నారి కళ్లకు గంతలు కట్టుకుని ఒక చేతిలో రెండు ట్రే స్కేల్ పట్టుకొని కనిపించింది. పోస్టర్ చూస్తుంటే ఈ సినిమా ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న ఒక ఫన్నీ కోర్టు డ్రామా అని అర్థమవుతుంది. #JAGonMay24 అనే హ్యాష్ ట్యాగ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. త్వరలోనే టైటిల్‌ను ప్రకటిస్తామని నిర్మాతలు ప్రకటించారు..



# చూపుల్తో నిషా ఎక్కించేస్తుంది..!

బాలీవుడ్ లో దీపికా పదుకొనే, అలియా భట్ లకు ఆల్టర్నేట్ గా మారుతుంది క్రేజీ బ్యూటీ కియరా అద్వాని. ఫగ్లీ తో బాలీవుడ్ కెరీర్ మొదలు పెట్టిన కియరా అద్వాని ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ రేంజ్ కి వెళ్లింది. సినిమా ఎలాంటిదైనా తను లీడ్ రోల్ కాకపోయినా తనకు ఇచ్చిన పాత్ర పర్ఫెక్ట్ గా చేస్తూ ఆడియన్స్ ని మెప్పిస్తూ వచ్చింది కియరా. అందుకే అమ్మడు ఇప్పుడు అక్కడ టాప్ ప్లేస్ లో దూసుకెళ్తుంది. హిందీతో పాటు తెలుగులో కూడా రెండు సినిమాలు చేసి ఇక్కడ ఆడియన్స్ కు ఫేవరెట్ గా మారింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాగా వస్తున్న గేమ్ చేంజర్ లో నటిస్తున్న కియరా హృతిక్ రోష, ఎన్.టి.ఆర్ కలిసి చేస్తున్న వార్ 2 లో కూడా ఛాన్స్ అందుకుంది. దీపికా, అలియా, జాన్వీలను దాటి ఈ ఛాన్స్ తన దాకా వచ్చిందంటే కియరా క్రేజ్ ఎలాంటిదో అర్ధం చేసుకోవచ్చు. ఓ పక్క సినిమాల్లో ఎంత బిజీగా ఉంటున్నా సోషల్ మీడియా ఫాలోవర్స్ కోసం ఎప్పటికప్పుడు కొత్త ఫోటో షూట్స్ తో అలరిస్తుంది కియరా. లేటెస్ట్ గా అమ్మడి లైట్ బ్లూ కలర్ మోడ్రన్ డ్రెస్ తో ఫాలోవర్స్ ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది కేవలం సినిమాల్లో గ్లామర్ రోల్స్ తో మెప్పిస్తే సరిపోదు ఫాలోవర్స్ ని తమ ఫోటో షూట్స్ తో కూడా అలరించాలని చూస్తున్నారు ఈ తరం కథానాయికలు. అందుకే కాస్త టైం దొరికితే చాలు ఇలా ఫోటో షూట్స్ చేస్తుంటారు. కియరా కూడా తమ ఫాలోవర్స్ ని అసలు డిజప్పాయింట్ చేయకుండా రకరకాల ఫోటో షూట్స్ తో కనువిందు చేస్తుంది. లేటెస్ట్ బ్లూ కలర్ డ్రెస్ లో కూడా తన తొడల అందాలతో అమ్మడి గ్లామర్ షో అదుర్స్ అనిపించేలా చేస్తుంది. కళ్లతోనే కైపెక్కించేలా.. చూపుల్తో నిషా ఎక్కించేస్తుంది కియరా. ఆఫ్టర్ మ్యారేజ్ ఏ హీరోయిన్ అయినా కెరీర్ లో కాస్త వెనుక పడుతుంది. కానీ కియరా మాత్రం ముందు కన్నా వేగంగా దూసుకెళ్తుంది. సౌత్ నార్త్ అనే తేడా లేకుండా అమ్మడు చేస్తున్న సినిమాలు ఆడియన్స్ ని ఖుషి చేస్తున్నాయి. అదనంగా అమ్మడు చేసే గ్లామర్ షో ఆమె గ్రాఫ్ మరింత పెరిగేలా చేస్తున్నాయి. కియరా క్రేజీ ఫోటో షూట్ చూసి కామెంట్స్ పెట్టడమే ఆమె ఫాలోవర్స్ వంతు అయ్యింది.